జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 17, జులై 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాతో సీఎం చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా గంటపాటు సమావేశం సాగింది. ఈ భేటీలో మంత్రులు, ఎంపీలూ ఉన్నారు.







# లేఖల గోల... దేవుడి లీల!

- తెలంగాణ భక్తులకు తిరుపతి దర్శనభాగ్యం ఎప్పుడు?
- తెలంగాణ ఎమ్మెల్యే లేఖలకూ విలువ ఇవ్వాలని వినతి
- తిరుమలలో కాటేజీలకు స్థలం అడిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- బాబును కలసి లేఖ ఇచ్చిన మంత్రి తుమ్మల
- తెలంగాణ భక్తుల మనోభావాలు గౌరవించాలని వినతి
- తెలంగాణ ఎమ్మెల్యే, ఎంపీలదీ అదే కోరిక
- జగన్ హయాంలో ఒత్తిడి చేయని కేసీఆర్
- కేసీఆర్ కోరి ఉంటే జగన్ అప్పుడే చేసేవారన్న భావన
- తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలపై గతంలో హరీష్ ప్రకటన
- రాష్ట్రం విడిపోయినా దర్శనాలకు మినహాయింపేల?
- తెలంగాణలోనూ టీటీడీ ఆస్తులు
- తెలంగాణ నుంచి తిరుపతికి లక్షల సంఖ్యలో భక్తులు
- భద్రాచలం, యాదాద్రి, బాసరలో తమ లేఖలకు విలువ ఇవ్వాలంటున్న ఏపీ ఎమ్మెల్యేలు

(మార్తి సుబ్రహ్మణ్యం)


ఈ సమస్య వింటే 'వినండి మనుషుల గోల.. కనండి దేవుడి లీల.. గోవిందా హరి గోవింద" అన్న 'దేవుడు చేసిన మనుషులు' సినిమా పాట గుర్తుకు రాక మానదు. దేవదేవుడైన తిరుపతి వెంకన్న దర్శనంపై, తెలంగాణ ప్రజాప్రతినిధుల ఆవేదన ఎవరు ఆలకిస్తారన్న చర్చకు తెరలేచింది. ప్రతిరోజూ వేల సంఖ్యలో, నెలకు లక్షల సంఖ్యలో తిరుపతికి వెళుతున్న తెలంగాణ భక్తుల నుంచి ఆదాయం కూడా భారీగా వస్తోంది. అయితే తిరుపతి సిఫార్సు లే(క)ఖ.. భక్తులు అగచాట్లు పడుతున్న వైనం ఇటీవలి కాలంలో చర్చనీయాంశమయింది.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఎమ్మెల్యేకు రోజుకు ఒక సిఫార్సు లేఖను టీటీడీ ఆమోదించేది. ఎమ్మెల్యేలు, మంత్రులకు ప్రొటోకాల్ దర్శనాలు ఉండేవి. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణ ఎమ్మెల్యే, ఎంపీల సిఫార్సు లేఖలను టీటీడీ పరిగణనలోకి తీసుకోవడం మానేసింది. అదృష్టం ఉన్నవాళ్లకు 300 రూపాయల టికెట్లు ఇస్తున్నారు. దానితో దర్శనం సరిగా జరగదన్నది భక్తుల వేదన. కానీ ఎమ్మెల్యేలు స్వయంగా వెళితే మిగతా.. 2లో

## ఉచిత ఇసుకలో మంత్రులు, ఎమ్మెల్యేలు

# జోక్యం చేసుకోవద్దు

- అక్టోబరు తర్వాత ఇసుక రీచులన్నీ అందుబాటులోకి
- బోట్ సొసైటీలకు కూడా అనుమతి
- డంప్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక
- వచ్చే 3 నెలల్లో కోటి టన్నుల ఇసుక అవసరం
- బోట్ సొసైటీల ద్వారా 80లక్షల టన్నుల ఇసుక
- క్యాబినెట్ భేటీలో మంత్రులతో సీఎం చంద్రబాబునాయుడు




అమరావతి,

ఉచిత ఇసుక విధానంలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని చెడ్డపేరు తెచ్చుకోవద్దని సీఎం చంద్రబాబు సూచించారు. కేబినెట్ భేటీ ముగిశాక రాజకీయ అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

"అక్టోబరు తర్వాత ఇసుక రీచులన్నీ అందుబాటులోకి వస్తాయి. బోట్ సొసైటీలకు కూడా మిగతా.. 2లో



# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ - 2022 రద్దు

- మంత్రి మండలి సమావేశం నిర్ణయాలు

అమరావతి,మహానాడు: రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకు కేబినెట్ సమావేశ మందిరంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు. మిగతా.. 2లో

# టీటీడీ జేఈఓగా వెంకయ్యచౌదరి

- ముందే చెప్పిన 'మహానాడు'
- మరి టీవీ5 నాయుడుకు చైర్మన్ ఇస్తారా?

(అన్వేష్)





టీటీడీ జేఈఓగా వెంకన్న చౌదరి?

- కేంద్ర సర్వీసు నుంచి రిలీవ్
- ఈ వారంలో ఉత్తర్వులు
- టీవీ5 నాయుడుకు చైర్మన్‌గా ప్రచారం
- వెంకన్నచౌదరి రాకతో సందిగ్ధం
- ఒకే కులానికి రెండు పోస్టులిస్తారా?

(అన్వేష్)

అమరావతి: టీటీడీ జేఈఓగా ఐఆర్ఎస్ అధికారి వెంకన్న(వెంకయ్య) చౌదరి నియమితులు కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఉన్న ఆయన, రిలీవ్ అయినట్లు సమాచారం. ఈవారం లోనే ఆయనను జేఈఓగా నియమిస్తూ ఉత్తర్వు వెలవడవచ్చని చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వెంకన్న చౌదరి, ఏపీకి డెప్యుటేషన్‌పై వచ్చిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా టీటీడీ చైర్మన్‌గా, టీవీ5 చైర్మన్ నాయుడును నియమిస్తారన్న ప్రచారం అటు పార్టీ మిగతా..2లో

తిరుమల తిరుపతి దేవస్థానం జేఈఓగా కేంద్ర సర్వీసులకు చెందిన ఐఆర్ఎస్ అధికారి చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి నియమితులయ్యారు. డెప్యుటేషన్‌పై వచ్చిన ఆయన ఆ పదవిలో మూడేళ్లు కొన సాగుతారు. దీనికి సంబంధించి వెంకయ్యచౌదరి డెప్యుటేషన్‌పై, కేంద్రం మంగళవారం ఆమోదముద్ర వేసింది. ఇదిలాఉండగా.. వెంకయ్యచౌదరిని టీటీడీ జేఈఓగా నియమించనున్నట్లు, ఈనెల 12 నాటి 'మహానాడు' ఈ-పేపర్‌లో వార్తా కథనం వెలువడిన విషయం తెలిసిందే. తాజాగా వెంకయ్యచౌదరి నియామకంతో, మహానాడు జోస్యం నిజమయినట్టయింది.

కాగా ఈనెలాఖరుకు టీటీడీ చైర్మన్ పదవిని కూడా ప్రకటిస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఆ మేరకు టీవీ5 చైర్మన్ బీఆర్ నాయుడుకు ఆ పదవి దక్కుతుందన్న ప్రచారం వినిపిస్తోంది. నిజానికి ఎన్నికల ముందే ఆయనకు ఆమేరకు మిగతా.. 2లో

# పారదర్శకంగా ప్రజాహిత పాలన

- ప్రజాపాలనే మా ప్రధమ ప్రాధాన్యం
- ప్రజల ప్రయోజనాలు అర్థం చేసుకుని పనిచేయండి
- భాషతోపాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వాములు కావాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ దిశానిర్దేశం
- ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే
- పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే బాధ్యత కలెక్టర్లదే
- ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదు
- కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే
- అయిదేండ్లలో రూ. లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు
- రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్



హైదరాబాద్, మహానాడు:

పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే తమ ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు, ప్రజల ప్రయోజనా లను అర్థం చేసుకొని పని చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

సచివాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్లతో ఇది రెండో సమావేశమని, ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనని సీఎం గుర్తు చేశారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి వారధులు.. మిగతా.. 2లో

## జిల్లాకో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం


- ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం
- సంక్షేమం, అభివృద్ధి రెండింటిపై దృష్టి పెట్టాలి
- పబ్‌లకు టైమింగ్ పెట్టండి
- స్ట్రీట్‌ఫుడ్ సెంటర్లను వేధించకండి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

4లో

## పాసు బుక్ ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ

- కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డు
- కలెక్టర్ల సదస్సులో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3లో




ఫలించిన కన్నా ప్రయత్నం

3లో



పాత ఫీజు రీఎంబర్స్‌మెంట్‌కు విధివిధానాలు రూపొందించండి

3లో



సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఛత్తీస్‌ఘడ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్




బాలినేని.. నీ కొవ్వు దించుతా

3లో



ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్‌లో లోపాలు సవరిస్తాం..

4లో



అమెరికా ఉపాధ్యక్ష బరిలో తెలుగింటి అల్లుడు!

5లో

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 17, జులై 2024



# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ - 2022 రద్దు

(మొదటిపేజీ తరువాయి..)

మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

**ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ - 2022 రద్దును ఆమోదిస్తూ కేబినెట్ తీర్మానం..**

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022పై ప్రజలకు పలు సందేహాలు, అనుమానాలు, భయాలు ఉన్నాయన్న విషయం పలు పత్రికలు, ఇతర మీడియా సంస్థల ద్వారా తేటతెల్లమైందని ల్యాండ్ టైటిలింగ్ అథారిటీ తెలిపింది. దీంతో ఈ చట్టాన్ని రద్దు పర్చాలని భూయజమానుల నుండి తీవ్రస్థాయిలో ఒత్తిడి మొదలైంది.

ఈ చట్టాన్ని రద్దు పరచడానికి ఏపీ టైటిలింగ్ అథారిటీ ప్రస్తావించిన కారణాలు :

నీతి ఆయోగ్ రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రకారం టీఆర్ వో గా ప్రభుత్వ అధికారి ఉండాలి. కానీ ఆ స్థానంలో గత ప్రభుత్వం ఎటువంటి అర్హత లేని వ్యక్తులను కూర్చోబెట్టేందుకు అవకాశం కల్పించే విధంగా మార్పులు చేసింది.

ఈ యాక్ట్ ప్రకారం సివిల్ కోర్టుల ప్రమేయం పూర్తిగా తుడిచివేయబడుతుంది. టీఆర్ వో దగ్గర సమస్య ఉత్పన్నమైతే నేరుగా వ్యయప్రయాసలకోర్చి హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులు చేసే వారసత్వ ఆస్తుల బదలాయింపులు సివిల్ కోర్టుల ద్వారా చేయబడవు.

ఈ చట్టం అమల్లోకి వస్తే ప్రస్తుత ఉన్న రిజిస్ట్రేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ మరియు న్యాయ వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి.

ఈ చట్టం చాలా హడావిడిగా స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా చేయబడింది

ఈ చట్టం ద్వారా రిజిస్ట్రేషన్ పొందిన భూయజమానికి జిరాక్స్ కాపీలు మాత్రమే ఇస్తారు. ఒరిజినల్ డాక్యుమెంట్స్ సదరు టీఆర్ వో వద్దే ఉంటాయి. దీని వల్ల ప్రభుత్వం సదరు ఆస్తులను తనఖా పెట్టుకునే అవకాశం ఉందని భూయజమానులు భయాందోళనకు గురయ్యారు.

ఇది ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తుందని భూయజమానులు సంఘ విద్రోహ శక్తుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేలా చేస్తుంది.

టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (టీఆర్ వో)లు జారీ చేసే జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) లు భూయజమానులను ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉంది. ఎలాంటి శిక్షణ, అవగాహన లేని టైటిలింగ్ రిజిస్ట్రేషన్ అధికారుల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరిన్ని అవరోధాలు, గొడవలు ఉత్పన్నమయ్యే పరిస్థితి.

టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులు, టైటిల్ అప్పిలేట్ అధికారులు స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి వారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ లు, మ్యూటేషన్ లు చేసే పరిస్థితి దాపురించే అవకాశం.

ఈ నేపథ్యంలో ప్రజలకు ఈ చట్టంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేబినెట్, ప్రజా ప్రతినిధులు మరియు మనందరిపైన ఉందని ముఖ్యమంత్రి సూచించారు.

ఇసుక, గనుల పాలసీ - 2019 మరియు మరింత మెరుగైన ఇసుక విధానం -2021లను రద్దుచేస్తూ ఉచిత ఇసుక మెకానిజం -2024 ఏర్పాటు అయ్యేంత వరకు ప్రభుత్వానికి ఆదాయం లేకుండా ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించే మధ్యంతర వ్యవస్థ ఏర్పాటు చేసేలా తేదీ: 8.7.2024న జారీ చేసిన జీవో ఎం.ఎస్ నంబర్ 43 కు కేబినెట్ ఆమోదం..

ఇప్పటివరకు ఆయా సంస్థలతో ఉన్న ఒప్పందాలను నిలుపుదల చేయడం, ఇసుకకు సంబంధించిన స్టాక్ ను సంబంధిత అధికారులకు అప్పగించాలని మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ కేబినెట్ ఆమోదం

శాండ్, మైనింగ్ పాలసీ -2022 మరియు మరింత మెరుగైన ఇసుక పాలసీ -2021 లను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మీదట వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ పర్యావరణ హితంగా సమగ్ర ఇసుక విధానం (కాంప్రహెన్సివ్ శాండ్ పాలసీ) - 2024ను రూపొందించాల్సిన అవసరం ఉంది.

వినియోగదారులకు సరసమైన ధరలకు ఇసుక లభించేలా చూడటం, శాండ్ ఆపరేషన్‌లో పారదర్శకతను పెంపొందించడం, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టడం, పర్యావరణ హితం కోరుతూ గౌరవ సుప్రీంకోర్టు, హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యూనల్ (ఎన్ జీటీ) ఇచ్చిన మార్గదర్శకాల మేరకు సమగ్ర ఇసుక విధానం -2024 ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

2024-25 సంవత్సరానికిగానూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం రూ.2000 కోట్ల రుణాన్ని వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుండి రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల సంస్థ పొందేలా అనుమతిస్తూ తేది: 28.6.2024 నాడు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ జారీ చేసిన జీవో ఎం.ఎస్ నంబర్ 6 లో రాష్ట్ర ప్రభుత్వ హామీని కోరుతూ చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం..



గత రబీ సీజన్‌లో సేకరించిన వరి ధాన్యానికి 84 రోజులు గడిచినా ఎటువంటి సొమ్ము చెల్లించకుండా తాత్సారం చేశారు. ఈ నేపథ్యంలో మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే బకాయి పడ్డ సొమ్ము రూ. 1000 కోట్లు సదరు రైతులకు చెల్లించింది.

రైతులకు కనీస మద్దతు ధర కల్పించే పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ఆహార, పప్పు ధాన్యాలను సేకరించి జాతీయ ఆహార భద్రతా చట్టానికనుగుణంగా తెల్ల రేషన్ కార్డు కలిగి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రాయితీ ధరలకు అందిస్తున్న విషయం విదితమే. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యసేకరణకు రుణాలను తీసుకోవాల్సిన పరిస్థితి.

2024-25 సంవత్సరానికిగానూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం ఏపీ మార్క్ ఫెడ్ కు ఎన్ సీ డీసీ (నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్) నుండి వర్కింగ్ కేపిటల్ అసిస్టెన్స్ రూపేణా రూ.3,200 కోట్ల కొత్తగా రుణాన్ని పొందేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వ హామీని కోరుతూ వ్యవసాయ, సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం..

ప్రస్తుతం అమల్లో ఉన్న ధాన్యం కొనుగోలు విధానంలోని లోపాలను సవరించి రైతులకు సులువైన విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని కేబినెట్ అభిప్రాయపడింది.

ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న క్రాఫ్ ఇన్సూరెన్స్ చట్టాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఆర్థిక, పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ మంత్రులు ముగ్గురితో కూడిన ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. నెలరోజుల్లో నివేదికను ఇవ్వాల్సిందిగా ఆ కమిటీకి సూచించారు.

కౌలు రైతులకు సులువుగా రుణాలు అందించే కొత్త విధానం తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై అధ్యయనం చేయాల్సిందిగా కేబినెట్‌కు ముఖ్యమంత్రి సూచించారు.

**ఇతర అంశాలు :**

ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మక గుల్బెంకియన్ అవార్డు వచ్చిందని, ఇది వ్యవసాయ రంగంలో నోబెల్ ప్రైజ్ తో సమానమని,ఈ అవార్డు క్రింద 9 కోట్ల రూపాయలు వచ్చింది. ఈ ప్రకృతి సేద్యాన్ని 2018లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 5 లక్షల హెక్టార్లతో ప్రారంభమై 10 లక్షల మంది రైతులను భాగస్వామ్యులను చేయడం జరిగింది.

ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా చేస్తున్న ప్రకృతి సేద్యం ప్రస్తుతం 4 రెట్లు పెరిగి 2029 నాటికి 20 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచి ఆదర్శ ప్రాయం అవుతుందని ముఖ్యమంత్రి కేబినెట్‌కి తెలియజేశారు.

# టీటీడీ జేఈఓగా వెంకయ్యచౌదరి

(మొదటిపేజీ తరువాయి..)

హామీ లభించిం దంటున్నారు. అయితే ఇప్పుడు జేఈఓగా, కమ్మ సామాజికవర్గానికి చెందిన వెంకయ్య చౌదరిని నియమించినందున.. చైర్మన్‌గా మళ్లీ అదే సామాజికవర్గానికి చెందిన నాయుడును నియమిస్తారా? అన్న సందేహం తెరపైకి వస్తోంది. ఒకవేళ గత ప్రభుత్వంలో జవహర్‌రెడ్డి ఈఓ, ధర్మారెడ్డి జేఈఓగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి చైర్మన్లుగా పనిచేసినందున.. నాయుడు నియామకంపై అభ్యంతరాలు ఎందుకన్న భావనతో, విమర్శలను లెక్క చేయకుండా, ఆయననే ఖరారు చేస్తారా చూడాలని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# లేఖల గోల... దేవుడి లీల!

(మొదటిపేజీ తరువాయి..)

మాత్రం దర్శనానికి ఏర్పాటుచేస్తున్నారు. అయితే ఈ విషయం తెలియని భక్తులు, ఎమ్మెల్యేల వద్ద టీటీడీ సిఫార్సు లేఖలు తీసుకునేందుకు వారి కార్యాలయాకు తరలివెళుతున్నారు.

వారు కూడా అసలు విషయం చెప్పకుండా, సిఫార్సు లేఖ ఇచ్చి భారం తగ్గించుకుంటున్నారు. తీరా టీటీడీ జేఈఓ ఆఫీసుకు వెళితే, ఆ లేఖలు చెల్లవని చావుకబురు చల్లగా చెబుతున్నారు. మరీ బ్రతిమిలాడితే కొందరికి రూములు ఇస్తున్నారట. ఇంకొన్ని సార్లు 300 రూపాయల టికెట్లు ఇస్తున్నారు. అంతా దైవాధీనం! తిరుపతి నుంచి స్వస్థలాలకు వచ్చే భక్తులు, ఎమ్మెల్యేగారి లెటర్లు పనిచేయడం లేదని నలుగురికీ చెబుతుండటంతో ఎమ్మెల్యేల పరువుపోతోంది.

కొంతమంది ధైర్యం చేసి 'మీ లెటర్లు నడవకపోయినా మాకు ఎందుకు ఇస్తున్నారు' అని ప్రశ్నిస్తే.. 'మీరు అడిగారు మేం ఇచ్చాం. అది మాధర్మం. మీరు అక్కడ ట్రై చేసుకోవాలి' అని, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది అసలు విషయం చెబుతున్నారు. ఇదీ ఎమ్మెల్యేల వేదన. దానితో హైదరాబాద్‌లో ఉండే భక్తులు, ఏపీకి చెందిన వారితో మాట్లాడుకుని తిరుపతి సిఫార్సు లెటర్లు తీసుకువెళుతున్న పరిస్థితి. హైదరాబాద్‌లో ఉండే టీటీడీ బోర్డు మెంబర్ల లేఖలతో, మరికొందరు దర్శనం చేసుకుని వస్తున్నారు. దీనితో పరువుపోతున్న ఎమ్మెల్యేలు, గతంలో మాదిరిగానే తమ లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని, కనీసం వారానికి మూడు లేఖ అయినా పరిగణనలోకి తీసుకోవాలని కోరు తున్నారు. నిజానికి టీటీడీకి తెలంగాణలో కూడా ఆస్తులు ఉన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కాగా ఈ సమస్యను గుర్తించిన తెలంగాణ వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబును కలిసి, తెలంగాణ భక్తుల తిరుపతి దర్శన సమస్యను వివరించారు. తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు.

అంతకుముందు దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ సైతం తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలను పట్టించుకోవడం లేదని, మీరు ఏపీ సీఎం జగన్‌తో ఒకసారి మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. దానికి స్పందించిన రేవంత్.. సీఎస్‌ను ఏపీ సీఎస్‌తో మాట్లాడాలని ఆదేశించారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం పోయి చంద్రబాబు సర్కారు వచ్చింది. ఇటీవల విభజన సమస్యలపై బాబు-రేవంత్ చర్చించిన సమయంలో, తిరుమలలో దర్శనాల సమస్య ప్రస్తావించారు. రోజూ తెలంగాణ నుంచి వేలాదిమంది భక్తులు తిరుమలకు వెళుతున్నందున, అక్కడ వారికి వసతి సమస్య ఏర్పడుతోందని బాబుకు వివరించారు. అందువల్ల కొండపైన తెలంగాణకు స్థలం కేటాయిస్తే కాటేజీలు నిర్మిస్తామని కోరారు.

'రాష్ట్రం విడిపోయినంత మాత్రాన దేవుడి దగ్గర ప్రాంతీయ భావాలెందుకు? తిరుపతికి వెళ్లాలనుకునే తెలంగాణ భక్తులకు మా లేఖలు అక్కరకొస్తే మాకూ పుణ్యమే కదా? అయినా ఇక్కడ కూడా టీటీడీకి ఆస్తులు ఉన్న విషయాన్ని మర్చిపోతే ఎలా? తెలంగాణ భక్తుల మనోభావాలు గుర్తించి, మా సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుంద'ని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

ఇదే అంశంపై గతంలో-ఇటీవల బీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు కూడా స్పందించారు. తెలంగాణ భక్తులకు ఎమ్మెల్యే లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన గతంలో కూడా డిమాండ్ చేశారు.

అయితే.. అసలు తన మిత్రుడైన జగన్ సీఎంగా ఉన్నప్పుడే కేసీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించి, తెలంగాణ ఎమ్మెల్యే లేఖలనూ పరిగణనలోకి తీసుకోవాలని కోరి ఉంటే, జగన్ దానిపై అప్పుడే సానుకూల నిర్ణయం తీసుకునేవారని కాంగ్రెస్-బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పుడు మౌనంగా ఉన్న బీఆర్‌ఎస్ నేతలు, ఇప్పుడు దర్శనాల గురించి మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు. కేసీఆర్-జగన్ మిత్రులైనందున.. అప్పుడే జగన్‌పై ఒత్తిడి చేసి ఉంటే, ఈపాటికి తెలంగాణ ఎమ్మెల్యేలు భక్తులకు సిఫార్సు లేఖలు ఇచ్చేవారని విశ్లేషిస్తున్నారు.

ఇదిలా ఉండగా తెలంగాణలోని అన్ని దేవాలయాలు కాకపోయినా.. భద్రాచలం, యాదాద్రి, బాసరకు ఏపీ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకోవడం లేదని, అటు ఏపీ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. తాము వెళ్లినప్పుడు మంచి మర్యాదలే చేస్తున్నప్పటికీ, తాము ఇచ్చే సిఫార్సు లేఖలను పట్టించుకోవటం లేదని వాపోతున్నారు.

యాదాద్రికి వచ్చే ఏపీ భక్తుల సంఖ్య తక్కువే అయినప్పటికీ.. భద్రాచలం ఆలయానికి వేల సంఖ్యలోనే వస్తుంటారు. ఇక తమ పిల్లల అక్షరాభ్యాసం బాసరలో చేస్తే, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకంతో వేలాదిమంది ఏపీ భక్తులు బాసరలోనే అక్షరాభ్యాసం చేయించేందుకు ఆసక్తిచూపుతున్నారు. కానీ వారికి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు చెల్లడం లేదు.

ఈ విధంగా తిరుపతిలో తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలు.. తెలంగాణ దేవాలయాలలో ఏపీ ఎమ్మెల్యే లేఖలు చెల్లుబాటుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక దేవుడిదే భారం! గోవిందా.. గోవింద!

# ఉచిత ఇసుకలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి..)

అనుమతి ఇస్తున్నాం. డంప్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక ఉంది. వచ్చే 3 నెలల్లో కోటి టన్నుల ఇసుక అవసరం. నదుల్లో పూడిక, బోట్ సొసైటీల ద్వారా 80లక్షల టన్నుల ఇసుక వస్తుంది. కొత్త మంత్రులు ఎప్పటి కప్పుడు అవగాహన పెంచుకోవాలి.

లోటు బడ్జెట్ ఉందని గ్రహించి మంత్రులు పనిచేయాలి. శాఖల సంబంధిత అంశాలపై ప్రతినెలా సమీక్ష చేయాలి. మంత్రులు తమ శాఖల పరిస్థితిని ప్రజలకు వివరించాలి. వివాదాలు లేకుండా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసమే డిల్లీ వెళ్తున్నాం. ఈనెల 22 నుంచి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. పంటలబీమా పథకం అమలుకు ముగ్గురు మంత్రులతో కమిటీ వేస్తున్నాం. గత ప్రభుత్వం ప్రీమియం కట్టకుండా రైతులను మోసం చేసింది" అని చంద్రబాబు వివరించారు.

కాకినాడలో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బియ్యం అక్రమాలపై మంత్రివర్గంలో చర్చ జరిగినట్టు సమాచారం. తండ్రి పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్, కొడుకు ఎమ్మెల్యే, ఇంకో కుమారుడు రైస్ మిల్లర్ల అసోసియేషన్ చైర్మన్. ఈ ముగ్గురూ కలిసి బియ్యం రీ సైక్లింగ్ చేసి కిలో రూ.43కి ఎగుమతి చేశారని ఆక్షేపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలని నాదెండ్ల మనోహర్ తెలిపారు. వచ్చే మంత్రివర్గ సమావేశం నాటికి ఏం చేద్దాం అనే దానిపై విధివిధానాలతో రావాలని నిర్ణయించారు

# పారదర్శకంగా ప్రజాహిత పాలన

(మొదటిపేజీ తరువాయి..)

సారధులు మీరేనని అన్నారు. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమర్థులైన యువ కలెక్టర్లను నియమించామని, రాజకీయ ఒత్తిళ్లు, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా కలెక్టర్ల బదిలీలు చేపట్టామన్నారు.

ఐఏఎస్ అధికారుల కెరీర్లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని సీఎం అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు ఏ జిల్లాలో పని చేసినా.. అక్కడి జిల్లా ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని, తాము పని చేసే ప్రాంత ప్రజలందరి అభిమానాన్ని అందుకునేలా పని చేయాలని సీఎం అన్నారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం టీచర్లకు ప్రమోషన్లతో పాటు బదిలీలు చేసిందని, కొన్నిచోట్ల టీచర్లు బదిలీపై వెళుతుంటే విద్యార్థులు సొంత కుటుంబసభ్యుడిలా స్పందించారు. వాళ్లకు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు మీడియాలో చూసినట్లు సీఎం చెప్పారు. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరు ఉండాలని అభిప్రాయపడ్డారు. అక్కడి ప్రజలు కలెక్టర్ ను బదిలీ చేయకుండా అడ్డుకునేంత అనుబంధాన్నిసంపాదించుకోవాలని ఉదాహరణగా చెప్పారు.

ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా ఐఏఎస్లు పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని.. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదని అన్నారు. తాము చేపట్టే ప్రతి పని.. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు.

జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రుల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి నెలా రూ.85వేలు ఖర్చు పెడుతుందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. అందుకే ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న చిన్న పనులను వెంటనే పరిష్కరించాలని సీఎం కలెక్టర్లకు సూచించారు.

'గతంలో పది పెద్ద జిల్లాలుండేవి. అప్పుడు పది మంది కలెక్టర్లే ఈ రాష్ట్రాన్ని అద్భుతంగా నడిపించారు. అప్పటితే పోలిస్తే ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గిపోయింది. అప్పటితో పోలిస్తే కలెక్టర్ల అధికారాలు, బాధ్యతల్లో తేడా ఏమీ లేదు. అప్పుడు పది మంది చేసిన పనిని ఇప్పుడు 33 మంది కలెక్టర్లు కలిసికట్టుగా ఎందుకు చేయలేరు..? ఎవరికివారుగా మీ ఆలోచనలు, మీ పనితీరును సమర్థతను చాటుకోవాలి. ఇది ప్రజా ప్రభుత్వం. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ప్రజలకు విశ్వాసం కల్పించే బాధ్యత మీదే...' అని సీఎం కలెక్టర్లకు మార్గదర్శనం చేశారు.

కలెక్టరేట్లలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారమైతే, హైదరాబాద్‌లో ప్రజాభవన్‌కు వచ్చే అర్జీల సంఖ్య తగ్గిపోతుందని, అదే మీ పనితీరుకు అద్దం పడుతుందని సీఎం అన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు.

ఇప్పటికే ప్రకటించిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనేది ప్రభుత్వ ధ్యేయమని సీఎం పునరుద్ఘాటించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని గృహ జ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకాలకు అర్హులెవరికైనా ఈ పథకం వర్తించకపోతే.. తమ ఆధార్, రేషన్ కార్డు, లేదా గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్తు సర్వీసు నెంబర్లు సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు పని చేసేలా చూడాలని, అవసరమైతే ప్రజావాణి జరిగే రోజున కలెక్టరేట్లలోనూ సేవాకేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు గృహజ్యోతికి 5.89 లక్షల మంది, అయిదు వందలకు గ్యాస్ సిలిండర్ పథకానికి 3.32 లక్షల మంది సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వివరించారు.

పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. 'ధరణి సమస్యల పరిష్కారానికి మార్చి 1 నుంచి మార్చి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇప్పటికే ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది.

అప్పటి నుంచి ఇప్పటివరకు 1,61,760 దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించిందని, కొత్తగా 1,15,308 దరఖాస్తు చేసుకున్నారని అధికారులు వివరించారు. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అధికారులు తిరస్కరణకు కారణాన్నికూడా తప్పకుండా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆగస్టు 15లోగా పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని గడువు నిర్ణయించారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది సభ్యులున్నారని, కోటి మందిని సభ్యులుగా చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీరిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం ప్రకటించారు.

అయిదేండ్లలో రూ. లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, చేపట్టే వ్యాపారాలకు తమ వినూత్న ఆలోచనలు కూడా జోడించాలని కలెక్టర్లకు సూచించారు. ఆర్టీసీలో కొత్తగా అవసరమయ్యే అద్దె బస్సులు కూడా మహిళా సంఘాలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని చెప్పారు.

# ఫలించిన కన్నా ప్రయత్నం

- కొండమోడు రహదారి విస్తరణకు సర్కార్ నిర్ణయం
- అమరావతి, హైదరాబాద్ మధ్య మార్గం సుగమం
- నితిన్ గడ్కరీకి బాబు ప్రతిపాదనలు
- సానుకూలంగా స్పందించిన గడ్కరీ
- 234 హెక్టార్ల భూసేకరణ అవసరం
- 22.5 మీటర్ల వెడల్పుతో నిర్మాణం
- ఇది పూర్తయితే హైదరాబాద్-అమరావతికి తగ్గనున్న దూరం
- సత్తెనపల్లిలో కన్నా తొలి విజయం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కన్నా లక్ష్మీనారాయణ







(శివ శంకర్ చలువాది)

పల్నాడు జిల్లా... పేరేచర్ల- కొండమోడు రోడ్డు గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలోని కీలక రహదారి. దీన్ని విస్తరించాలనేది ఉమ్మడి గుంటూరు జిల్లా వాసుల దశాబ్దాల కల. అయితే సంవత్సరాలుగా ఈ కల సాకారం కాకపోవడంతో గోతులమయమైన ఇరుకు రోడ్డులో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.

ప్రధానంగా సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు ఉన్న 27 కిలోమీటర్ల మార్గం అత్యంత దారుణంగా మారి నిత్యం అనేక ప్రమాదాలతో పదుల సంఖ్యలో వాహనదారులు చనిపోతున్నారు. గతంలో ఓ అడుగు ముందుకు పడి ఆగిన ఈ రోడ్డు విస్తరణకి మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో మోక్షం కలిగింది.

గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు 50 కిలోమీటర్ల దూరం. గుంటూరు నుంచి పల్నాడు, హైదరాబాద్ వైపు వెళ్లే వారికి ఇది ప్రధాన మార్గం. ఈ మార్గంలో పేరేచర్ల నుంచి సత్తెనపల్లి వరకు రహదారి కొంత బాగానే ఉన్నా, సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు ఉన్న 27 కిలోమీటర్లు మాత్రం అత్యంత అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలతోపాటు బెర్మ్‌లు లేవు, పైగా రహదారి పూర్తిగా ఇరుకుగా ఉంటుంది.

ఎదురుగా నాలుగు చక్రాల వాహనం వచ్చిందంటే దానికి వ్యతిరేకంగా వస్తున్న మరో వాహనం పక్కకు దిగి ఎదుటి వాహనానికి దారి ఇవ్వాల్సిన పరిస్థితి. ఏదైనా భారీ వాహనం వస్తే మాత్రం ఇక అంతే సంగతి. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొంత మంది క్షతగాత్రులుగా మారుతున్నారు. అదే సమయంలో ప్రయాణానికీ అదనపు సమయం పడుతోంది.

ఏళ్లుగా ఈ రహదారిని విస్తరించాలని ప్రయాణికులు అనేక సార్లు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయినా అడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాష్ట్ర రాజధానిగా ఎంపిక చేయడంతో మరోసారి ఈ మార్గం విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించింది. కేంద్రం జాతీయ రహదారి 167 ఏజీగా గుర్తించి విస్తరణకు ఆమోదం తెలిపింది.

## ఫలించిన కన్నా ప్రయత్నం



కాగా ఈ రోడ్డు నిర్మాణం కోసం మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఆ మేరకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో ప్రధానమైన హామీ నెరవేర్చినట్టయింది. ఈ రహదారిలో నెలకొన్న సమస్యల గురించి, ఆయన ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గోతులమయమైన ఈ రహదారిలో జరుగుతున్న ప్రమాదాలను, ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మించడం ద్వారా ప్రయాణం సులభమవడంతోపాటు, దూరం కూడా తగ్గుతుందన్న కన్నా నివేదిక ప్రయత్నాలకు ఫలితం దక్కింది.

భారత్ మాల పరియోజన కింద దేశవ్యాప్తంగా 2 లక్షల కోట్లతో జాతీయ రహదారుల విస్తరణ పనులతోపాటు పేరేచర్ల- కొండమోడు రహదారి పనులకు శ్రీకారం చుట్టింది. నాలుగు వరుసలుగా విస్తరణకు 1,032 కోట్లతో టెండర్లు పిలిచి, గుత్తేదారు ఎంపికై ఎల్‌ఓఏ ఇచ్చే దశకు పనులు చేరుకున్నాయి. అయితే జాతీయ రహదారుల బడ్జెట్‌కు మించి పనులు మంజూరవడంతో, గత సంవత్సరం నవంబరు నుంచి వీటిని కేంద్రం తాత్కాలికంగా నిలిపేసింది.

నవ్యాంధ్రకు రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు రాష్ట్రంలో 9 నెలలుగా నిలిచిపోయిన కీలకమైన 8 జాతీయ రహదారుల విస్తరణ ఆవశ్యకతను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో ఆగిపోయిన పేరేచర్ల-కొండమోడు రహదారి విస్తరణ పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించడానికి గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరించాలి. సర్వే పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డు, పోరంబోకు భూములను విభాగాలుగా విభజించి నివేదిక సిద్ధం చేశారు. రహదారి విస్తరణకు ఏ రైతు నుంచి ఎంత భూమి సేకరిస్తారు? ఎంత పరిహారం లభిస్తుందన్న వివరాలు సిద్ధమయ్యాయి. భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తిచేసి కేంద్రానికి రాష్ట్రం నివేదిక అందించింది. కేంద్రం భూసేకరణకు నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో సొమ్ము చేసి గుత్తేదారుకు భూమి అప్పగిస్తారు.

నాలుగు వరుసల విస్తరణలో ఒక్కొక్క వైపు 8.75 మీటర్ల వెడల్పు రహదారి, డివైడర్ 1.5 మీటర్లు, రెండువైపులా మార్జిన్‌లు కలిపి 22.5మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5 కిలోమీటర్లు బైపాస్, సత్తెనపల్లిలో 11 కిలోమీటర్ల బైపాస్ నిర్మించాల్సి ఉంది.

పేరేచర్ల- కొండమోడు నాలుగు వరుసల ఈ మార్గం విస్తరణ పూర్తయి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి రాజధాని అమరావతికి ప్రయాణ సమయం తగ్గుతుంది. మరోవైపు సీఆర్‌డీఏ నిర్మించే బాహ్యవలయ రహదారికి కూడా సత్తెనపల్లి వద్ద ఈ మార్గం అనుసంధానం కానుంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులకు రాకపోకలు సాగించే వారికి ఈ రహదారి కీలకంగా మారనుంది.

# పాత ఫీజు రీఎంబర్స్‌మెంట్‌కు విధివిధానాలు రూపొందించండి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల తగ్గుదలపై మంత్రి ఆందోళన
- ఉన్నతవిద్య శాఖపై అధికారులతో మంత్రి నారాలోకేష్ సమీక్ష



అమరావతి,మహానాడు:

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీఎంబర్స్‌మెంట్ విధానాన్ని అమలుచేసేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఉన్నతవిద్యశాఖ పరిధిలో నెలకొన్న సమస్యలపై మంత్రి లోకేష్ సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విద్యాదీవెన, వసతిదీవెనకు సంబంధించి గత ప్రభుత్వం 3,480 కోట్లు బకాయిలు పెట్టడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు ఆయా విద్యా సంస్థల్లో నిలచిపోయాయని అన్నారు.

ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో డ్రగ్స్‌ను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకం అంశాన్ని పరిశీలించాలని అన్నారు. అదేవిధంగా డ్రగ్స్ పై విద్యార్థులను చైతన్యం చేసేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 3220 లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

న్యాయపరమైన చిక్కులను తొలగించి సాధ్యమైనంత త్వరగా పోస్టులను భర్తీచేసేందుకు కసరత్తు చేపట్టాలని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ ప్రక్రియ ఉండాలని స్పష్టం చేశారు. యూనివర్సిటీలకు సంబంధించి అకడమిక్, ఎగ్జామినేషన్ షెడ్యూలు, క్యాలండర్ తయారుచేసి, నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహణ, ఫలితాల ప్రకటనకు చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గత అయిదేళ్లుగా ప్రవేశాలు తగ్గిపోవడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు.

ఈ విషయమై సీరియస్‌గా దృష్టిసారించి, అడ్మిషన్ల పెంపుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉన్నత విద్యా సంస్థల వివరాలు, మౌలిక సదుపాయాలు, అడ్మిషన్లు, కోర్టు కేసుల వివరాలు తదితర అంశాలన్నింటినీ డ్యాష్ బోర్డులో పొందుపర్చాలని అన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజులు ఏమేరకు ఉండాలి, రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల పనితీరు, అప్రెంటీస్ షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు కళాశాలల ఎంపిక, రాష్ట్రంలో శ్రీ పొట్టిశ్రీరాములు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల ఏర్పాటు చేసే అంశాలపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఉన్నత విద్య కార్యదర్శి సౌరబ్ గౌర్, కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యశాఖ ఇన్ ఛార్జి చైర్మన్ రామ్మోహన్ రావు, టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ బి.నవ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ-వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన గ్రామ-వార్డు సచివాలయాల శాఖ నూతన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్.. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు విషయాలను ఇరువురూ చర్చించారు.




3

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 17, జులై 2024


# పాసు బుక్ ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ

- కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డు
- కలెక్టర్ల సదస్సులో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




హైదరాబాద్,మహానాడు:

భూమి పాసుబుక్‌పై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి రుణమాఫీపై పలు విషయాలు వెల్లడించారు.

కేవలం కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డును వాడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే రుణాలు ఉన్న రైతు ఖాతాల సంఖ్య 70 లక్షలేనన్నారు. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికి రుణాలు ఉన్నాయని, వారికి రుణమాఫీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు.

18వ తేదీ ఉదయం (గురువారం) 11 గంటలకు కలెక్టర్లు జిల్లా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలని, వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించవద్దని సూచించాలన్నారు. గతంలో కొందరు బ్యాంకర్లు అలానే చేస్తే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇప్పుడు అలానే చేస్తామని హెచ్చరించారు.

18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రుణమాఫీ జరిగే రైతులను రైతు వేదికల వద్దకు తీసుకురావాలని, ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు రైతులతో ఆ సంతోషాన్ని పంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

రైతు రుణమాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు జిల్లాలకు (ఉమ్మడి జిల్లాల చొప్పున) ఒక ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామని, కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# సంజయ్ గారూ.. కరీంనగర్ కష్టాలు కడతేర్చండి

- బడ్జెట్‌లో జిల్లాకు నిధులు తీసుకురండి
- పెండింగ్-కొత్త ప్రాజెక్టులకు మోక్షం కలిగించండి
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగలేఖ

కరీంనగర్, మహానాడు:

జిల్లాకు చెందిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కేంద్ర మంత్రిగా మీ పలుకుబడి ఉపయోగించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తన జిల్లాకే చెందిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కు రాసిన బహిరంగలేఖలో కోరారు. ఆమేరకు ఆయా ప్రాజెక్టుల వివరాలు తన లేఖలో పేర్కొన్నారు.

మంత్రి పొన్నం బహిరంగలేఖ పూర్తి పాఠం ఇదీ..

కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం మరియు ప్రత్యేకంగా కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చే బడ్జెట్ సెషన్‌లో తగినంత బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూడాలని కోరుతున్న.

తెలంగాణ రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర-రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచడంలో కేంద్ర ప్రభుత్వానికి తన మద్దతును అందించడానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఈ విషయంలో రాష్ట్ర విభజన సమయంలో మన రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతగా వ్యవహరించాలి.రాష్ట్రానికి కేంద్రం నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రిగా మీ పాత్ర చాలా కీలకమైంది.

నేను రాష్ట్ర మంత్రిగా మరియు కరీంనగర్ బిడ్డగా, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైన బడ్జెట్ కోసం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అభివృద్ధి పనుల గురించి మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను.

1. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం.
2. మిడ్‌మానేరు, గౌరవెల్లి ప్రాజెక్ట్ భూనిర్వాసిత భాదిత కుటుంబాలకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన.
3. శాతవాహన విశ్వవిద్యాలయానికి 200 కోట్ల ఆర్థిక సహాయం అందించడం
4. కరీంనగర్ తిరుపతి మధ్య నడిచే బై వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు ప్రతి రోజు నడిచేలా చేయాలి.





5. కరీంనగర్ మరియు షిర్డీ మధ్య రైల్వే మార్గం డబ్లింగ్‌ను వేగవంతం చేయడం
6. హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజీ మంజూరు.
7. కొత్తపల్లి నుండి జనగాం జాతీయ రహదారి మంజూరు.
8. సిరిసిల్ల టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి నిధులు.
9. వేములవాడ, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి నిధులు.
10. NLM, PMEG మరియు NHM పథకాల కింద తగినంత బడ్జెట్ కేటాయింపు.

రాబోయే బడ్జెట్ సమావేశాలలో పైన పేర్కొన్న అభివృద్ధి పనులను కార్యరూపం దాల్చేందుకు కరీంనగర్ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఉపయోగించాలని కోరుతున్న.

# బాలినేని.. నీ కొవ్వు దించుతా

- ఇంకోసారి వాడు, వీడు అని మాట్లాడు... నీ సంగతేంటో చూస్తా
- ఇలాగే మాట్లాడితే నీ కొవ్వు దించుతానంటూ జనార్దన్ కౌంటర్
- బాలినేనికి టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వార్నింగ్

ఒంగోలు,మహానాడు:

ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపొందగా, బాలినేని శ్రీనివాసరెడ్డి ఓడిపోయారు. తాజాగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదిరింది.



ఎన్నికల తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన బాలినేని తాజాగా ఒంగోలు వచ్చి కార్యకర్తలతో సమావేశమై టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై మాటల తూటాలు పేల్చారు.

ఏం... మేం చేతకానివాళ్లం అనుకుంటున్నావా... చెప్పుతో కొడతాం అంటూ నిన్న ఓ రేంజిలో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో, బాలినేని వ్యాఖ్యలపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఘాటుగా స్పందించారు. నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరికే వదలం అంటూ హెచ్చరించారు.

"జైలుకెళ్లినా రెండ్రోజుల్లో వస్తా, చూస్తా అంటున్నావు... నువ్వేం చూస్తావో మేం కూడా చూస్తాం. నువ్వు (అధికారంలో) ఉన్నప్పుడే పీకలేకపోయావు. ఇప్పుడేం పీకుతావో చూస్తా. కొన్ని మాటలు అనాలంటే సంస్కారం అడ్డొస్తోంది. వయసులో పెద్దవాడివి. ఇంకోసారి వాడు, వీడు అని మాట్లాడు నువ్వు... నీ కొవ్వు దించుతాను.



ఏదో గమ్మున ఉంటున్నాం కదా అని రెచ్చిపోతున్నారా? అధికారం అడ్డంపెట్టుకుని నువ్వు, నీ కొడుకు ఎన్ని అరాచకాలు చేశారు? ఆసుపత్రిలో డబ్బులు వసూలు చేయలేదా? గ్రానైట్‌లో డబ్బులు వసూలు చేయలేదా? ఒక్కో బార్ లోకి వెళ్లి సీసాకు రూ. 10 వసూలు చేయలేదా? వైశ్యులకు చెందిన కమర్షియల్ బిల్డింగ్‌లకు డబ్బులు వసూలు చేయలేదా?

నాకేం తెలియదు, నా కొడుక్కేం తెలియదు అని ఇప్పుడు మాట్లాడుతున్నారు. మీరు చేసిన పాపాలకు ప్రజలు బుద్ధి చెప్పారు. సంస్కారంతో మాట్లాడడం తెలుసుకో. వచ్చావా... కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పావా... అంతవరకే!

ఎన్నికల్లో ఓడిపోయాక కార్యకర్తలకు ధైర్యం చెప్పకుండా ఎందుకు పారిపోయావు? కౌంటింగ్ రోజున మాకు ఇంకా సర్టిఫికెట్ ఇవ్వకముందే, నువ్వు 4 గంటలకే వెళ్లి హైదరాబాదులో కూర్చున్నావు.నీలాంటి వాడిపై కార్యకర్తల్లో ఏం విశ్వాసం ఉంటుంది? ఇవాళ వచ్చి కార్యకర్తలకు అండగా ఉంటానని ఎలా చెబుతావు?" అంటూ దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు.


జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 17, జులై 2024







## ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్‌లో లోపాలు సవరిస్తాం..

- భక్తులందరికీ మౌలిక వసతులు
- దుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసిన విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

ఇంద్రకీలాద్రి,జూలై 16, మహానాడు:

భక్తులందరికీ మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రి క్షేత్రంపై వేంచేసిన దుర్గమ్మ వారికి మంగళవారం ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి ఆలయ కార్యనిర్వణాధికారి కె ఎస్ రామారావు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు

వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు అందించవలసిన వసతులు, జరుగుతున్న అభివృద్ధి పనులపై దుర్గగుడి అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.

2014 నుంచి 19 వరకు అప్పటి మాస్టర్ ప్లాన్ ఏమైంది అన్నారు. తర్వాత కాలంలో వైకాపా పాలనలో నాటి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పుడు కొనసాగుతోందని, అందుకు సంబంధించిన విషయాలను అధికారులు వివరించారు.

అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులందరికీ మౌలిక వసతులు ఏ విధంగా అందిస్తున్నారని వారికి సదుపాయాలు పూర్తిస్థాయిలో అందక పోవడానికి గల కారణాలు, పార్కింగ్ సమస్య తలెత్తుతున్న తీరు , ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత మంది పనిచేస్తున్నారని , ఆయా పనులకు కాంట్రాక్టర్లు ఎవరని పూర్తిస్థాయి వివరాలను తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

ఇంకా పూర్తిస్థాయి పనులు చేపట్టాలని తెలియజేశారు. భక్తులందరికీ మెరుగైన వసతులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో సమన్వయం చేసుకొని అభివృద్ధి పనులు చేస్థామని ఎమ్మెల్యే తెలియజేయడం జరిగింది.

గత ప్రభుత్వంలో అప్పటి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఏకపక్షంగా అమ్మవారి అంతరాలయ టికెట్టు 300 రూపాయలు నుంచి 500 రూపాయలు చేశారని భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రస్తుతం మౌలిక వసతులు, అభివృద్ధిపై సమావేశ మైనట్లు తొలి సమావేశం అని సుజనా చౌదరి మీడియా ప్రతినిధులకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సమావేశాలు ఏర్పాటు చేసి ఆలయ అభివృద్ధి, పూర్తిస్థాయి సమీక్షలు, నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు.

ఈ సమావేశంలో దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరావు, రమా, పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన నేత బాడిత శంకర్, ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి వేడుకలకు పటిష్ఠ భద్రత

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ కంచి శ్రీనివాసరావు

వినుకొండ, మహానాడు:

వినుకొండ కొండపై వేంచేసిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న తొలి ఏకాదశి వేడుకలకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. వినుకొండ కొండపై జరగనున్న తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా దేవుని దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొండపై జరుగుతున్న ఈ పండుగకు ఎక్కువ సంఖ్యలో భక్తులు దేవుని దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగినంత మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించాం. దీనితో పాటు ఘాట్ రోడ్డు వెంబడి అదేవిధంగా కొండపై ఉన్న ఆలయం చుట్టూ భారికేడింగును దేవాదాయ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేశామన్నారు.

అదేవిధంగా కొండపై పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తిన సహాయ సహకారాలు అందించడానికి మా పోలీసులను అందుబాటులో ఉంచామ




న్నారు. డ్రోన్ కెమెరా నిఘాతో ఎప్పటికప్పుడు కొండపై మరియు కొండ చుట్టూ భద్రత ఏర్పాట్లను పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

స్వామివారిని దర్శించుకునే భక్తులు నిర్దేశించిన దారిలోనే కొండపైకి రావాలని, వెళ్లాలని, అంతే కాకుండా అడ్డదారిలో కొండ ఎక్కి ప్రమాదాలకు గురి కావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ పోలీసువారికి సహకరించి పండుగను విజయవంతం చేయాలని శుభాకాంక్షలు తెలిపారు.

## దేవాలయంలో భారీ చోరీ

- లక్షల విలువ చేసే ఆభరణాలు మాయం

తెనాలి, మహానాడు:

గుంటూరు జిల్లా తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భారీ చోరీ జరిగింది. గత రాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు, గర్భాలయంలోకి ప్రవేశించి అమ్మవారి బంగారు అభయ హస్తాలు, పాదాలు, బంగారు కళ్ళు, మంగళ సూత్రాలు, బొట్టు అపహ రించారు.



గర్భాలయంలో శివుని నాగాభరణాలు, పానపట్టం వంటి సుమారు పది లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు అపహరణకు యత్నం చేశారు. శివుని ఆభరణాలు సుమారు 2లక్షల విలువ చేసేవి మోయలేక అక్కడే వదిలేసి పారిపోయారు. సీసీ కెమెరాలు సైతం వైర్లు ధ్వంసం చేసి హార్డ్ డిస్కులు దుండగులు ఎత్తుకెళ్లారు.

ఇదే దేవాలయంలో గతంలో రెండు సార్లు చోరీకి విఫల యత్నం చేశారు. తాజాగా మూడోసారి భారీ చోరీ జరగడంతో స్థానికులలో భయాందోళన నెలకొంది. గత మూడు రోజుల క్రితం భట్టిప్రోలు, వెల్లటూరు గ్రామాలతో సహా కృష్ణా జిల్లాలోని పలు ఆల యాల్లో చోరీ చేసిన ముఠా పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించండి

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మహానాడు:

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించి అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలో మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయనను ఎమ్మెల్యే గళ్ళా మాధవి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను, ప్రధాన సమస్యలైన రోడ్లు డ్రైనేజీ సమస్యల నివేదికలను మంత్రి నారాయణ ముందు ఉంచారు. గత వైసీపీ పాలకుల ధన దోపిడీ కారణంగా నగరంలో అభివృద్ధి కుంటుపడిందని, ఒక పనిని ఏళ్ల తరబడి కొనసాగిస్తున్నారని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే మాధవి తీసుకువెళ్లారు. నగరంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని గత సంవత్సరం అనేక డయేరియా కేసులు, మరణాలు సంభవించాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థలను చక్కదిద్దడానికి అవసరమైన అధునాతన మిషన్లను, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచటమే మార్గమని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.



అదేవిధంగా నగరంలో ఎప్పటినుండో నిలిచిపోయిన పీకల వాగు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు దీనిని మొదటి ప్రాధాన్యత కింద తీసుకొని పీకలవాగుకు మరమ్మత్తుల నిర్వహించి అవసరమైన చోట్ల చప్టాలు సైడు గోడల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అదే మాదిరిగా నగరంలో వీధి కుక్కల బెడద ఉన్నదని మంత్రి దృష్టికి గళ్ళా మాధవి తీసుకెళ్లారు. గళ్ళా మాధవి చెప్పిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

## ఓడిపోయిన అభ్యర్థులను అసెంబ్లీలోకి అనుమతించండి

సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావు గౌడ్ వ్యంగ్యం

హైదరాబాద్,మహానాడు:

గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను అసెంబ్లీలోకి అనుమతించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావు గౌడ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

మంగళవారం అసెంబ్లీ ఆవరణలో అయన మాట్లాడారు. నియోజక వర్గంలో ఎమ్మెల్యేకు కనీసం సమాచారం లేకుండా శంకుస్థాపనలు, కల్యాణ లక్ష్మి, బోనాల చెక్కులను ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు.

## జిల్లాకో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం

- ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం
- సంక్షేమం, అభివృద్ధి రెండింటిపై దృష్టి పెట్టాలి
- పబ్‌లకు టైమింగ్ పెట్టండి
- స్ట్రీట్‌ఫుడ్ సెంటర్లను వేధించకండి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు:

ఆయా జిల్లాలో ఉన్న వనరులు, ప్రాంత పరిస్థితుల ఆధారంగా ప్రతి కలెక్టర్ ఒక్కో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేసి అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆయా కార్యక్రమాలపై కలెక్టర్ల ముద్ర స్పష్టంగా ఉండాలన్నారు. కలెక్టర్లు, ఎస్పీలతో జరిగిన సదస్సులో భోజన విరామం అనంతరం పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి మార్గనిర్దేశనం చేశారు.

ఆరు గ్యారెంటీల అమలును కలెక్టర్లు సీరియస్‌గా తీసుకోవాలని, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జాతీయ రహదారులకు భూ సేకరణలో జాప్యం జరుగుతుండడంతో వ్యయం పెరుగుతోందని, సంక్షేమంతో పాటు అభివృద్ధి పైనా దృష్టి సారించాలన్నారు. జిల్లా మంత్రులు, ఇన్ ఛార్జి మంత్రుల కార్యక్రమాలకు సరైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అటవీ భూముల్లో పండ్ల మొక్కలు నాటడం వలన ఓ వైపు గిరిజనులకు ఆదాయం, మరోవైపు పచ్చదనం పెంపొందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గిరిజనులకు ఆదాయం లేకనే పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, వారికి పట్టాలు ఇచ్చిన భూముల్లో మామిడి, సీతాఫలం, జామ వంటి పండ్ల మొక్కలు నాటిస్తే సీజన్ల వారీగా పండ్ల ద్వారా ఆ కుటుంబాలకు ఆదాయం వస్తుందన్నారు.

మూడు నుంచి నాలుగేళ్లలో పంట వచ్చే హైబ్రిడ్ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. ఆదాయం ఉన్నప్పుడు ఆ చెట్లనే వారే రక్షిస్తారని, మరోవైపు పచ్చదనం ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. పలు అటవీ ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ ఖాళీ ఉందని, డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వే చేయించాలని ముఖ్యమంత్రి సూచించారు. అనంతరం అక్కడ భూసార పరీక్షలు చేయించి ఆ నేలల్లో పెరిగే పండ్ల మొక్కలు నాటించాలని ఆదేశించారు. తద్వారా కోతుల సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని సీఎం అన్నారు.

వికారాబాద్ హవా.. టీబీకా దవా అనే (వికారాబాద్ గాలి.. టీబీకి మందు) నానుడి ఉందని, కానీ ఇప్పుడు వికారాబాద్ అటవీ ప్రాంతం చాలావరకు ఖాళీగా ఉందన్నారు. అక్కడ గతంలోలా ఔషధ మొక్కలు నాటించాలని ముఖ్యమంత్రి ఆదేశిం చారు. పులుల సఫారీకి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతానికి వెళుతున్నారని, మన దగ్గర ఆదిలాబాద్ జిల్లాలోనూ అటవీ ప్రాంతం ఉన్నా పులులు సంచారం లేదని, వాటికి అవసరమైన ఆవాసం, నీటి సౌకర్యం కల్పిస్తే అటవీ పర్యాటకం పెంపొందించవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

వన మహోత్సంలో మనం నాటే మొక్కలు 50 ఏళ్ల పాటు ఫలసాయం అందించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కలెక్టర్లు నెలకోసారి అటవీ ప్రాంతాల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గతంలోలా ప్రభుత్వ భూమి లభ్యత లేనందున ప్రాజెక్టు కట్టలు, కాలువ కట్టలు, రహదారుల వెంట తాటి, ఈత చెట్లు నాటాలని, మూడునాలుగేళ్లలో గీత వృత్తిదారులకు ఆదాయం వచ్చేలా హైబ్రిడ్ మొక్కలు నాటాలని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు ఒకే చోట ఉండేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఈ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో రహదారులకు అనుసంధానంగా ఉండే గ్రామాలు, పట్టణాల్లో వాటికి స్థలాల ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఎవరు ముందుగా స్థలాలు ఎంపిక చేస్తే వారికి వెంటనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అప్ గ్రేడ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కలెక్టర్లు తమ పరిధిలోని ఐటీఐలను సందర్శించి వాటిని ఏటీసీలుగా మార్చే ప్రక్రియ ఎలా సాగుతుందో పరిశీలించాలన్నారు. అధునాతన సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నందున ప్రస్తుతం ఉన్న ఐటీఐల్లో స్థలం సరిపోకపోతే ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక చేసుకోవాలని సూచించారు.

విద్యారంగానికి తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇప్పటికే




అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బడుల్లో మౌలిక వసతులు మెరుగుపర్చామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు పాఠశాలలను తనిఖీ చేయాలని, డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీ చేసేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్లు పాఠశాలలు తనిఖీ చేసిన తర్వాత అక్కడ సమస్యలు పరిష్కారం కావాలని, లేకుంటే ఆ తనిఖీలకు ప్రాధాన్యం తగ్గిపోతుందన్నారు. మధ్యాహ్న భోజనం మరింత మెరుగ్గా అందించేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ వంటి సంస్థల సహకారం తీసుకునే అంశంపై అధ్యయనం చేయాలని విద్యా శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులతోనే కానీ నేరస్థులతో కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పబ్బులు విషయంలో టైమింగ్ పెట్టొచ్చని, ఆంక్షల పేరుతో రాత్రి వేళల్లో స్ట్రీట్ ఫుడ్ పెట్టుకునే వారిని ఇబ్బంది పెట్టవద్దని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్ లకు ముఖ్యమంత్రి సూచించారు.

ఐటీ రంగంలో వారు రాత్రి వేళల్లో పని చేయాల్సి ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పోలీసులు రహదారులపై కనిపించాలని, పీరియాడికల్ క్రైమ్ రివ్యూ చేయాలని, కమిషనర్లు, ఎస్పీలు మొదలు ఎస్ హెచ్ వోల వరకు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గతేడాది కన్నా నేరాలు తగ్గాయని పోలీసు అధికారులు వివరించారు. గణాంకాలతో ఆ వివరాలను మీడియాకు తెలియ జేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ విషయంలో పోలీసు, ఎక్సైజ్, టీజీ న్యాబ్ అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి అన్నారు. డ్రగ్స్ కేసుల్లో విదేశీయులు పట్టుపడుతున్నారని, వారు ఏ పని మీద రాష్ట్రానికి వస్తున్నారు? ఏం చేస్తున్నారనే దానిపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్‌తో పట్టుపడిన వారిని డీఅడిక్షన్ సెంటర్లో ఉంచాలని, ఇందుకోసం చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలులో కొంత భాగాన్ని వినియోగించుకోవాలన్నారు.

కల్తీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులు, యూరియా సిద్ధంగా ఉన్నాయని, సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే కలెక్టర్లు జాగ్రత్త వహించాలని మంత్రి అన్నారు. కొన్నిసార్లు కృత్రిమ కొరత సృష్టించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రయత్నం చేస్తారని, అటువంటివి జరగకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 17, జులై 2024

# ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

- నగరంలో అధ్వాన పారిశుద్ధ్యంపై కమిషనర్ ఆగ్రహం
- ఆకస్మిక తనిఖీలో పలువురు అధికారులు సస్పెండ్

**గుంటూరు, మహానాడు:**

ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఏ స్థాయి అధికారులపై అయినా శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, బ్రాడిపేట, కోబాల్ట్ పేట, కొత్తపేట, అరండల్ పేట, పొత్తూరివారి తోట, గుంటూరు వారి తోట తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెంబడి చెత్త కుప్పలు ఉండడం, కార్మికులు ప్రధాన రోడ్ల స్వీపింగ్ ప్రారంభించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడం, పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం, సమగ్ర పర్యవేక్షణ లేకపోవడంతో పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా ని సరెండర్ చేయగా, బృందావన్ గార్డెన్స్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్.వి.ఎస్. ప్రసాద్‌ని సస్పెండ్ చేశారు. కొత్తపేట శానిటరీ ఇన్స్పెక్టర్ హిదయతుల్లా పై చార్జెస్ ఫ్రేం చేసి, అక్కడి నుంచి బదిలీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డ్ సచివాలయం వారిగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ జరగని ప్రాంతాల్లో ప్రజలు రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేస్తున్నారని, ఆయా సచివాలయ కార్యదర్శులు, ఇన్ స్పెక్టర్లు పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ప్రజారోగ్యానికి భంగం కల్గించేలా విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఏ స్థాయి అధికారుల పైన అయిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నగరంలోని పలు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, ఇన్ స్పెక్టర్ నిర్దేశిత సమయం విధుల్లో ఉండటం లేదని, ప్రధానంగా



మస్టర్‌కి కూడా హాజరు కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని, బుధవారం నుండి మస్టర్లను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. శానిటరీ సూపర్వైజర్లు పర్యవేక్షణ లోపం వలన పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వారి పని తీరుని కూడా సమీక్ష చేస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల కల్లా కార్మికులు, కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్ల హాజరు నివేదిక తమకు పంపాలని, ప్రతి ఒక్కరూ వైర్‌లెస్ సెట్ తప్పని సరిగా వినియోగించాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు.

వార్డ్ సచివాలయాల వారిగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, సచివాలయం పరిధిలో చెత్త సేకరణ సమయం ముందుగా ప్రజలకు తెలియచేయాలన్నారు. మస్టర్ అయిన వెంటనే ప్రదాన రహదార్ల స్వీపింగ్ ప్రారంభించాలని, శానిటేషన్ కార్యదర్శులు కార్మికుల పనిని దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్నం ప్రాధాన్యత క్రమంలో గ్యాంగ్ వర్క్ జరగాలని, ప్రస్తుత వర్షాలకు డ్రైన్లలో వ్యర్ధాలు అడ్డుపడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ (ఎఫ్‌ఏసి) మధుసూదన్, శానిటరీ సూపర్వైజర్ సోమ శేఖర్, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సాగర్ కుడికాలువకు 17న నీటి విడుదల

**హైదరాబాద్, మహానాడు:**

నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా నాలుగు టీఎంసీల నీటి విడుదలకు కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ అంగీకరించింది. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయనున్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని బోర్డుకు సిఫార్సు చేసింది. హైదరాబాద్‌లోని కృష్ణా బోర్డు కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. సాగర్ కుడి కాలువకు నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు సానుకూలంగా స్పందించారు.




# టిడిపి ఆఫీస్‌పై దాడి కేసు వేగవంతం

- నిందితులకు బెయిల్ నిరాకరణ
- పలువురు వైసీపీ నేతల పరార్

**మంగళగిరి, మహానాడు:**

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితులకు గుంటూరు జిల్లా కోర్టు బెయిల్ నిరాకరించింది. నిందితుల బెయిల్ పిటిషన్‌పై గుంటూరు జిల్లా కోర్టులో విచారణ జరిగింది. అనారోగ్య కారణాలతో గిరి రాంబాబు అనే వ్యక్తికి మాత్రమే బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే...

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో నిందితులకు గుంటూరు జిల్లా కోర్టు బెయిల్ నిరాకరించింది. దాడి ఘటనకు సంబంధించి అరెస్టయిన ఆరుగురు వైఎస్సార్సీపీ నేతలు బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ విచారించిన న్యాయమూర్తి, నిందితుల్లో ఐదుగురికి బెయిల్ నిరాకరించారు. అనారోగ్య కారణాల రీత్యా గిరి రాంబాబు అనే నిందితుడికి బెయిలు మంజూరు చేశారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు 10 మందికి పైగా అరెస్టు చేశారు. అయితే కీలక నిందితులు పరారీలో ఉన్నారు. ఘటన జరిగినప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు, పాల్గొన్న వారి వివరాలు, అసలు పాత్రధారుల విషయాలను అప్పట్లో సరిగా రికార్డు చేయలేదు. దీంతో నిందితులను గుర్తించడం, ఎవరి పాత్ర ఏమిటనేది నిర్ధారించడంపై పోలీసులు ఇప్పుడు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.

కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా మొత్తం 70 మందికి పైగా దాడిలో పాల్గొన్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా పలువురు వైఎస్సార్సీపీ నేతలను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. 2021 అక్టోబర్లో టీడీపీ కార్యాలయంపై దాడి జరిగింది.

### వైఎస్సార్సీపీ కీలక నేతల ప్రమేయంపై దర్యాప్తు

కేసు విచారణ వేగవంతం కావడంతో వైఎస్సార్సీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, విజయవాడ కార్పొరేటర్ , విజయవాడ నగరపాలక వైఎస్సార్సీపీ ఫ్లోర్ లీడర్ తదితరులను నిందితులుగా చేర్చారు. మొత్తం ఇప్పటివరకు పలువురు వైఎస్సార్సీపీ నేతలను నిందితులుగా గుంటూరు జిల్లా పోలీసులు గుర్తించారు. దీంతో కొందరు నేతలు ఇప్పటికే రాష్ట్రం వదిలి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు.

విజయవాడ నగరంలోని గుణదల, రాణిగారి తోట, కృష్ణలంక ప్రాంతాలకు చెందిన వారు దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. వీరంతా వైఎస్సార్సీపీ నేత దేవినేని అవినాశ్ అనుచరులని సమాచారం. నిందితుల్లో పలువురు కార్పొరేటర్లు సైతం ఉన్నట్లు తెలిసింది. 18వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్సీపీ ఫ్లోర్ లీడర్ అరవ సత్యం, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి కుమారుడు రాజా, దుర్గ గుడి పాలకమండలి సభ్యురాలు బచ్చు మాధవి, గాంధీ సహకార బ్యాంకు డైరెక్టర్ జోగరాజు, మాజీ ఉప మేయర్ చల్లారావు, తదితరులు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

వీరి ప్రమేయంపై సాక్ష్యాలు సైతం ఇప్పటికే సేకరించినట్లు తెలిసింది.

# వినుకొండని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా..


- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు
- డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**వినుకొండ, మహానాడు:**

వినుకొండ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, దీనిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 32వ వార్డు విష్ణుకుండి నగర్లో డ్రైనేజీ నిర్మాణం పనులకు మంగళవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32వ వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు వార్డ్ కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వార్డు ప్రజలు పడుతున్న అవస్థలపై కౌన్సిల్లో చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కౌన్సిలర్ లింగమూర్తి చూపిన చొరవను ఆయన కొనియాడారు.

పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు.



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిషనర్ తోట కృష్ణవేణి, డీఈ వెంకయ్య, టీడీపీ నాయకులు పీవీ సురేష్ బాబు, ఆయుబ్ ఖాన్, విష్ణు కుండి నగర్ పార్టీ అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు, 32వ వార్డు ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, ఎమ్మెల్యే గెలుపు నేపథ్యంలో పాదయాత్ర

**వినుకొండ, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, వినుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులు భారీ మెజార్టీతో గెలిచిన నేపథ్యంలో స్థానిక 11వ వార్డు రైలుపేట నుంచి మదమంచి పాడు ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు పాదయాత్రగా కూటమి నాయకులు మునయ్య ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఇంఛార్జి నాగ శ్రీను రాయల్, మండల నాయకులు, వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# అమెరికా ఉపాధ్యక్ష బరిలో తెలుగింటి అల్లుడు!

- సెకండ్ లేడీగా తెలుగమ్మాయి ‘ఉషా చిలుకూరి’
- ఇంతకీ ఎవరీ ఉషా చిలుకూరి? ఎవరా అల్లుడు?

**అమెరికా, మహానాడు:**

ఆమెరికన్ గ్రాండ్ ఓల్డ్ పార్టీ- రిపబ్లికన్స్ గెలిస్తే అగ్రరాజ్య అమెరికాకి ఓ తెలుగింటమ్మాయి సెకండ్ లేడీ (రెండో మహిళ)గా నిలుస్తారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష పదవికి డోనాల్డ్ ట్రంప్‌ను ఆ పార్టీ సోమవారం సాయంత్రం ఎంపిక చేస్తే, ట్రంప్ తన వైస్ ప్రెసిడెంట్ క్యాండిడేట్‌గా ఒహాయో రిపబ్లికన్ సెనేటరు, తెలుగింటి అల్లుడు జేడీ వాన్స్‌ను ఎంచుకున్నారు. వివరాల్లోకి వెళితే...

39 ఏళ్ల జేడీ వాన్స్ ఓ తెలుగు మూలాలున్న అమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ట్రంప్ గెలిస్తే వాన్స్ భార్య ఉషా చిలుకూరి వాన్స్ యునైటెడ్ స్టేట్స్‌కి రెండవ మహిళ అవుతారు. మిల్వాకీలో జరిగిన పార్టీ సమావేశంలో డోనాల్డ్ ట్రంప్ జేడీ వాన్స్ పేరును ప్రకటించారు. ట్రంప్ పై శనివారం దాడి జరిగిన మరుక్షణమే స్పందించిన తొలి రాజకీయ నాయకుడు జేడీ వాన్స్. ట్రంప్ పై హత్యాప్రయత్నం వెనుక ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాత్ర ఉండవచ్చునని ట్వీట్ చేసిన రిపబ్లికన్ సెనేటర్ వాన్స్.

ఒకప్పుడు ట్రంప్ విమర్శకుడిగా ఉన్న జెడి వాన్స్ ఇప్పుడు ట్రంప్ కి అత్యంత ఇష్టమైన అనుచరుడని అంటారు. ఆయన భార్య ఉషా చిలుకూరి ఒకప్పుడు డెమెక్రటిక్ పార్టీ సభ్యురాలు. కొన్నేళ్ళ కిందట ఆ పార్టీకి రాజీనామా చేసి రిపబ్లికన్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. నేషనల్ లీగల్ ఏజెన్సీలో వ్యాజ్యకర్తగా (లిటిగేటర్) పని చేస్తూ ఎన్నో కేసుల్ని పరిష్కరించిన ఉషా చిలుకూరి మూలాలు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నాయి.

తెలుగు మూలాలున్న అమెరికన్. ఇంతకీ ఎవరీ ఉషా చిలుకూరి? ఏమా కథ!

జేడీ వాన్స్ పేరును ట్రంప్ ప్రకటించినప్పటి నుంచి రెండు మూడు గంటలుగా గూగుల్ హోరెత్తుతోంది. ఆమె ఎవరో తెలుసుకునేందుకు లింక్ డెన్ మొదలు ఫేస్ బుక్ వరకు ఒకటే వెతుకులాట సాగుతోంది. ది న్యూయార్క్ టైమ్స్ ప్రకారం భారతీయ వలసదారుల బిడ్డ. భారత సంతతికి చెందిన న్యాయవాది ఆమె.

ఆమె తల్లిదండ్రులు సుదీర్ఘ కాలం కిందట ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం వెళ్లి స్థిరపడ్డారు. ఉషా కూడా కాలిఫోర్నియాలోనే పుట్టారు. శాన్ డియాగో, కాలిఫోర్నియాలో పెరిగారు. ప్రస్తుతం ఆమె వయసు 38. ఆమె లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం రాంచో పెనాస్కిటోస్‌లోని మౌంట్ కార్మెల్ హై స్కూల్‌లో చదివారు. ఆధునిక చరిత్ర ఆమెకు ఇష్టమైన సబ్జెక్ట్. ప్రఖ్యాత యేల్ విశ్వవిద్యాలయం



నుంచి చరిత్రలో బీఏ చదివారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఆధునిక చరిత్రలో ఎంఫిల్ పట్టా పొందారు. యేల్ యూనివర్శిటీలో ఉన్నప్పటి నుంచే జేడీ వాన్స్ తో ఉషాకు పరిచయం ఉంది. ఆ పరిచయమే పెళ్లి వరకు వచ్చింది.

### సుప్రీంకోర్టులా క్లర్క్‌గా...

ఎంఫిల్ పూర్తవుతూనే 2018లో అమెరికా సుప్రీం కోర్ట్‌కు లా క్లర్క్‌గా పని చేసిన ఆమె, ఆ తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో వాషింగ్టన్ డీసీలోని ముంగెర్, టోల్లెస్, ఓల్సన్ లో పనిచేశారు. కాలికేస్తే మెడకి, మెడకేస్తే కాలికేసే- సివిల్ లిటిగేషన్ల పరిష్కారంలో ఆమె దిట్ట. వ్యాపారం మొదలు కుటుంబ సమస్యల వరకు వివిధ రంగాలకు చెందిన అప్పీళ్లను కొలిక్కి తేవడంలో ఆమెకు మంచి నైపుణ్యం ఉంది. మంచి లిటిగేటర్‌గా పేరుంది.

### వాన్స్‌తో పరిచయం, పెళ్లి

ఉషా చిలుకూరి యేల్ లా స్కూల్‌లో జేడీ వాన్స్‌ని 2013లో కలుసుకున్నారు. 2014లో పెళ్లి జరిగింది. పెళ్లి కాలి ఫోర్నియాలో హిందూ సంప్రదాయం ప్రకారమే జరిగినట్టు తెలుస్తోంది. ఆమె పెళ్లి ఓ హిందూ పురోహితుడి ఆధ్వర్యంలో జరిగినట్టు ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.

“తెల్లజాతీయులు ఎక్కువగా ఉండే అమెరికాలో సామాజిక క్షీణత” అనే అంశంపై డిబేట్ నిర్వహించేందుకు వీరిద్దరూ కలిసి పని చేస్తున్న సమయంలో వీళ్ల మనసులు కలిసినట్టు ది న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. యేల్స్ స్పిరిట్ గైడ్ ఉష...జేడీ వాన్స్ తరచుగా ఉషను అతని “యేల్ స్పిరిట్ గైడ్”గా పిలిచేవారట. ఎవరికైనా పరిచయం చేయాల్సి వచ్చినా అలాగే పరిచయం చేసేవారట. దీంతో వీరిద్దరి మధ్య బంధం త్వరగానే బలపడినట్టు చెబుతారు.

‘యేల్ లా స్కూల్’ నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత వారు 2014లో వివాహం చేసుకున్నారు. యేల్‌లో చదువుతున్నప్పుడే ఉష యేల్ లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా, యేల్ జర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆమె సుప్రీం కోర్ట్ అడ్వకసీ క్లినిక్, మీడియా ఫ్రీడమ్ అండ్ ఇన్ఫర్మేషన్ యాక్సెస్ క్లినిక్, ఇరాకీ రెఫ్యూజీ అసిస్టెన్స్ ప్రాజెక్ట్‌లో పాలుపంచుకున్నారు.

కోర్ట్‌కు లా క్లర్క్‌గా పని చేయడానికి ముందు 2015 నుంచి 2017 వరకు శాన్‌ఫ్రాన్సిస్కో వాషింగ్టన్ డీసీలోని వివిధ సంస్థలలో పని చేశారు. విద్య, వైద్యం, ప్రభుత్వం సహా వివిధ రంగాలలోని సంక్లిష్టమైన సివిల్ లిటిగేషన్లను, అప్పీళ్లను పరిష్కరించిన అనుభవం ఆమెకుంది. వివిధ అంశాలపై అవగాహన ఉన్న ఉష భర్త ఎన్నికై వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలను స్వీకరిస్తే వైట్ హౌస్‌లోకి ప్రవేశించిన ఓ తెలుగింటి అమ్మాయిగా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది.




### ఎవరీ జేడీ వాన్స్...

యువతకు గొంతుకగా నిలిచిన ఓ తెల్లజాతి వర్కింగ్ క్లాస్ యువకుడు. పేదరికం రుచి తెలిసిన వాడు. ఒహాయోలోని అల్పాదాయ కమ్యూనిటీలలో పెరిగిన వాడు. పేదరికం-ఆర్థిక పోరాటాలపై ఆయన రాసిన-హిల్‌బిల్లీ ఎలిజీ- అనే పుస్తకం 2016లో ఓ పెద్ద సంచలనం. గ్రామీణ అమెరికాలో చాలా మంది ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ పుస్తకం అద్దం పట్టింది. అనేక భాషల్లోకి అనువాదమైంది. మిలియన్ల కాపీలు అమ్ముడయ్యాయి.

రాన్ హోవార్డ్ దర్శకత్వంలో సినిమా కూడా వచ్చింది. ప్రస్తుతం ఇతనో రైజింగ్ స్టార్. గ్రాండ్ ఓల్డ్ పార్టీ తరఫున వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ పడుతున్నారు. కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో పెరిగాడు. అతని తల్లి మాదకద్రవ్యాల అలవాటుతో పోరాడింది. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నాడు. తాతల ఇంటే పెరిగాడు. అందువల్లే తన ఇంటి పేరును కూడా మార్చు కున్నారు. తాతల పేర్లు వచ్చేలా జేడీ వాన్స్ అని పేరు పెట్టుకున్నాడు.

ఇన్ని ఇబ్బందులున్నా వాన్స్ తన కుటుంబ పురోగతికి చాలా పాటు పడ్డాడు. మాజీ వెంచర్ క్యాపిటలిస్ట్. సక్సెస్ఫుల్ రచయిత. ప్రముఖ రాజకీయ నాయకుడు. ఇక వెనక్కి తిరిగి చూసే సూచనలే కనిపించడం లేదు.

తన భర్త రాజకీయ ప్రయాణంలో ఉషా చిలుకూరి ఓ అదృశ్యశక్తి. ఓ పక్క కుటుంబాన్నీ మరోపక్క ముగ్గురు పిల్లల్ని చూసుకుంటున్న ఉష మన తెలుగింటి అమ్మాయి కావడం గర్వకారణం.

(సేకరణ: ఐ-హబ్)

6

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 17, జులై 2024

# ఆస్ట్రేలియాలో టీడీపీ గెలుపు సంబరాలు

◆ ముఖ్య అతిథిగా సినీ నటుడు శివాజీ

**ఆస్ట్రేలియా, మహానాడు:**

ఆస్ట్రేలియా మెల్బోర్న్‌లో టీడీపీ గెలుపు సంబరాలు అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య




అతిథిగా ప్రముఖ సినీ నటుడు శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నారై టీడీపీ తరుపున ప్రకటించిన లక్ష ఉద్యోగ అవకాశాలను అమలుపరచాలి కోరారు. అలాగే వైసీపీ వాళ్లు సోషల్ మీడియాలో చేసే దుష్ప్రచారాన్ని



తిప్పికోట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. దాదాపు 1100 మంది టీడీపీ కార్యకర్తలు, సానుభూతి పరులు విజయోత్సవ సంబరాలకు హాజరై సభను జయప్రదం చేశారు. తెలుదేశం మెల్ బోర్న్ కమిటీ ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని రీతిలో సభను నిర్వహించారు. మెల్ బోర్న్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు ఆధ్వర్యంలో సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# తొలి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

◆ కొండపై పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీవీ

**వినుకొండ, మహానాడు:**

వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి తొలి ఏకాదశి తిరునాళ్ల బుధవారం ఘనంగా జరగనుంది. దీనిలో భాగంగా వినుకొండ మున్సిపల్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం కొండపై జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 40 వేల వరకు భక్తులు పైకొండకు వచ్చే అవకాశం ఉందని భావించి భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దేవాలయం నిర్మాణంలో ఉండడం వలన బాలాలయంలో, ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయని



పేర్కొన్నారు. ఘాట్ రోడ్డుకు బారి గేట్స్, కొండపై ఆలయం వద్ద క్యూలైన్లు, ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారని వివరించారు.

శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్న కొండపై భక్తులకు అన్నప్రసాదాలు, మంచినీటి స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కొండపై టాయిలెట్స్, మెడికల్ క్యాంపులు అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు. తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలు దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే హిమాలయ గురుజి బుధవారం సాయంత్రం 6:30 గంటలకు అఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహిస్తారని, భక్తులు వేలాదిగా హాజరై అఖండ జ్యోతి దర్శించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబంపై కార్మెల్ మాత దీవెనలు

◆ తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

◆ ఘనంగా ఫిరంగిపురం కార్మెల్ మాత ఉత్సవాలు

**ఫిరంగిపురం, మహానాడు:**

ఫిరంగిపురంలో కార్మెల్ మాత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మెల్ మాత విగ్రహం వద్ద ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కార్మెల్ మాత దీవెనలు ప్రతి కుటుంబంపై ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# హంతకులను కఠినంగా శిక్షించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

**గుంటూరు, మహానాడు:**

చేబ్రోలు కొత్తరెడ్డి పాలెంకి చెందిన దళిత బాలిక పేరుపోగు శైలజ హంతకులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల వద్ద వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ చేబ్రోలులో 7వ తరగతి చదువుతున్న బాలిక స్కూలుకు వెళ్ళి తిరిగిరాని స్థితిలో, కుటుంబ సభ్యులు వెతుకుతుండగా నాగరాజు అనే వ్యక్తి ఇంటి వద్ద బాలిక పాదరక్షలను గుర్తించి తలుపులు పగలగొట్టి చూడగా బాలిక హత్యకు గురైందని నాగరాజు పరారిలో ఉన్నట్లు తెలుస్తుందన్నారు. వెంటనే అతనిని అరెస్టు చేసి విచారణ జరిపి నిజనిజాలు తేల్చాల్సి వుందన్నారు.

పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి నిందితులపై చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గత రెండు నెలల కాలంలోనే రాష్ట్రంలో మహిళలపై అనేక చోట్ల అత్యాచారాలు జరిగినట్లు వార్తలు వస్తున్నాయని వీటిని నిలువరించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. బాలికను అత్యాచారానికి గురి చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులను శిక్షించాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఈమని అప్పారావు, దండా లక్ష్మీనారాయణ, వై.కృష్ణకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




**జిల్లా విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయండి.**

సీపీఎం జిల్లా విస్తృత సమావేశం ఈ నెల 17న ఉదయం 10 గం.లకు 2/7 బ్రాడిపేట లోని సీపీఎం కార్యాలయంలో జరుగుతుందని జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు పాల్గొంటారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, మండల, పట్టణ కమిటీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేర్చండి

◆ దర్శి అభివృద్ధికి సహకరించండి

◆ కలెక్టర్‌ను కోరిన తెదేపా ఇంఛార్జి గొట్టిపాటి లక్ష్మి

**దర్శి, మహానాడు:**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సారధ్యంలో కూటమి ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు, పథకాలు ప్రజల దరి చేర్చే విధంగా అధికారుల నుంచి సంపూర్ణ సహకారం అందించాలని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు దర్శి నియోజక వర్గంలోని సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ... దర్శి నియోజకవర్గంలో కొందరు అధికారుల పనితీరు, వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి పనులు చేయకుండా బిల్లులు కోసం వైసీపీ నేతలు అడ్డదారుల్లో చేస్తున్న ప్రయత్నాలు, ఎన్నికల్లో వైసీపీ నేతలు దాడులు, కేసులపై కలెక్టర్‌తో చర్చించామన్నారు. దర్శి అభివృద్ధి కోసం సంపూర్ణంగా సహకరించాలని కలెక్టర్ ను కోరారు.

దర్శి పట్టణంతోపాటు నియోజక వర్గంలోని గ్రామాలకు అవసరమైన తాగునీరు అందించేందుకు సాగర్ జలాలను మళ్లించాలని కోరారు. నీటి ఎద్దడి అధికంగా ఉందని



తెలిపారు. దీనివల్ల కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగు దల, దర్శి పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన వంటి వివిధ అంశాలపై చర్చించారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం, రేషన్ డీలర్ల నియామకం, ఖాళీగా ఉన్న రెవెన్యూ మండల పరిషత్, ప్రభుత్వ వైద్యశాలల్లో పోస్టుల భర్తీలు వీఆర్వోలు నియామకాలపై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరించారు.



# ఆటోనగర్ పూర్తి చేసి చిలకలూరిపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాం

◆ ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఆటోనగర్‌ను పరిశీలించిన ప్రత్తిపాటి

◆ బుధవారం సాగర్ కుడి కాలువ ద్వారా నీటి విడుదల

◆ సోమ లేదా మంగళవారానికి చిలకలూరిపేట చెరువుకు సాగర్ జలాలు

**చిలకలూరిపేట, మహానాడు:**

చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన ఆటోనగర్‌ను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి చిలకలూరిపేటకే ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తామని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సకల సౌకర్యాలతో త్వరలోనే లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. చిలకలూరిపేట మండలం పోతవరం వద్ద ఆటోనగర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు.

తెదేపా గత ప్రభుత్వం 2016లోనే ఈ ఆటోనగర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు చేపట్టామని, ఆటోమొబైల్స్ యూనిట్ల ఏర్పాటుకు ఏపీఐఐసీ 42.30 ఎకరాల భూమి కూడా కేటాయించిందన్నారు. నాడు రూ.50 కోట్లతో తొలిదశలో రహదారులు, విద్యుత్ స్తంభాలు, అంతర్గత మురుగు కాల్వలు పూర్తి చేసినా 2019లో ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆటోనగర్ పనులు తిరిగి పట్టాలెక్కించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఏపీఐఐసీ డీజడ్ఎం జీవన్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీజడ్ఎం దొరబాబుతో చర్చించారు. ఆటోనగర్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు.

ఫేజ్-1, ఫేజ్-2లను కలిపి మధ్యలో ఉన్న భూముల రైతులు ముందుకొస్తే వాటిని కూడా అభివృద్ధి చేయాలని, గత పాలకుల్లా ఎవరిపై ఒత్తిడి మాత్రం చేయమని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. నాడు తొలి దశ పనులతో పాటు లబ్ధిదారులను కూడా ఎంపిక చేశామన్నారు. కానీ తర్వాత ఈ ఆటోనగర్‌కే కాదు ఇంకొక ఆటోనగర్‌కు కూడా స్థలం ఇస్తామని చెప్పిన వైకాపా అవన్నీ మరిచిపోయి ప్రజల్ని మోసం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం మారడంతో ఇంతకాలానికి ఆ గ్రహణం వీడిందన్నారు.

టాటా, మహీంద్రా కంపెనీల తరహా జీపులు తయారుచేసే శక్తి సామర్థ్యాలు ఉన్న కార్మికులు ఇక్కడ ఉన్నారన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆటోనగర్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారో వారికే తెలియాల్సనారు. ఎంఎస్ఎంఈలో ఏమైతే ప్రయోజనాలు ఉన్నాయో వాటితో పాటు ఏపీఐఐసీ ద్వారా వచ్చే ప్రయోజనాలను తీసుకుంటామని వివరించారు. ఇక్కడి కార్మికుల్లో ఎక్కువమంది పేదలు, ముస్లిం మైనార్టీలు ఉన్నారన్నారు. వారందరికీ అనువుగా ఉంటే తప్ప ఇక్కడికి రారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లి ఎంతమేరకు వారికి రాయితీలు ఇప్పించాలో అంత ఇప్పిస్తామన్నారు.

ఎంఎస్ఎంఈ ద్వారా స్టేట్ జీఎస్టీ 9% ఐదేళ్లు ఉచితంగా ఇప్పిస్తామంటున్నారని తెలిపారు. ఐదేళ్లు రాయితీ ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రాయితీ, అభివృద్ధి కూడా చేయాల్సి ఉందన్నారు. ఎంఎస్ఎంఈలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం వరకు రాయితీ వస్తుందన్నారు. 3 శాతం వడ్డీ రాయితీలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ, ఏపీఐఐసీ, రాష్ట్ర ప్రభుత్వం అయితే 25 పైసలకే రుణాలు ఇప్పించే సౌకర్యం ఉందని ఏపీఐఐసీ అధికారులు చెప్పారన్నారు.

విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు రూపాయి తగ్గించే సౌకర్యం కూడా ఉందని చెప్పారని, ఏది ఏమైనా రాయితీలు ఎక్కువ ఉంటే తప్ప ఈ ఆటోనగర్ ముందుకు వెళ్లే అవకాశం లేదన్నారు. ధర కూడా తగ్గించమని చెబుతున్నారన్నారు. గతంలో స్క్వేర్ మీటర్ రూ.1096 పెట్టారని, కానీ ఆ ధర ఎక్కువగా ఉందని చెబుతున్నారని, కాబట్టి వీటన్నింటిపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడిన తర్వాత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చిలకలూరిపేట ఆటోనగర్ ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఆయనకు వివరించి ఏవిధంగా రాయితీలు కల్పించాలో చర్చిస్తామన్నారు.

ఈ ఆటోనగర్‌లో మొత్తం 42.30 ఎకరాల్లో 613 ప్లాట్‌లు ఉన్నాయన్నారు. 613 మంది కార్మికులకు ఇవ్వొచ్చని తెలిపారు. ఏదైనా పెద్ద షెడ్డు నిర్మాణం చేసుకోవాలంటే 2, 3ప్లాట్‌లు కూడా తీసుకోవచ్చన్నారు. దానికి అనుగుణంగా యూనియన్ బ్యాంకు కూడా సిద్ధంగా ఉందన్నారు. నెల రోజుల్లో దీనికి ఒక కార్యాచరణ, కార్యరూపం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో కొందరు ప్లాట్‌ల కోసం డబ్బులు కట్టి వెనక్కి తీసుకున్నారని, ప్రస్తుతం వారి ఆలోచనలు ఏవిధంగా ఉన్నాయో పరిగణనలోకి తీసుకుంటాం అన్నారు.

మొత్తం మీద ఆటోనగర్ ఏర్పాటుతో చిలకలూరిపేటను ప్రత్యేక స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమన్నారు ప్రత్తిపాటి పుల్లారావు. తాగునీటి అవసరాల దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే సాగర్ కుడి కాలువ ద్వారా 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆదేశించారని ప్రత్తిపాటి తెలిపారు. చిలకలూరిపేట చెరువులను పరిశీలించిన తర్వాత ఇదే విషయమై నిన్న జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడినట్లు చెప్పారు.

బుధవారం సాగర్ కుడి కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తారని, సోమ లేదా మంగళవారానికి చిలకలూరిపేట చెరువుకు జలాలు చేరే అవకాశం ఉందన్నారు. దానికి తగిన విధంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించామన్నారు. నిన్న రాత్రి నుంచే పట్టణానికి నీటి సరఫరాను పెంచాలని సూచించామన్నారు. గత పాలకుల తప్పిదాల వల్లనే నెల రోజులుగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. రాబోయే 15 రోజుల తర్వాత చిలకలూరిపేట మంచినీటి సమస్య కూడా పరిష్కారం కాబోతుందన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

◆ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మహానాడు:**

చంద్రబాబు నాయుడు, ప్రజలు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఉద్యోగ నగర్‌లోని సంజయ్ ఆర్కేడ్ అపార్ట్మెంట్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవికి అభినందన సభను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడూతూ.. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు చాలా అనతి కాలములోనే తనను ఎంతగానో ఆదరించారని, నియోజకవర్గ చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ మెజార్టీని కట్టబెట్టారని, ఈ మెజార్టీ తన మీద ఇంకా బాధ్యతను పెంచిందని గళ్ళా మాధవి తెలిపారు.

ఏడిఆర్ సంస్థ చేసిన సర్వేలో 61.58% ఓట్ల శాతం పొందిన మహిళా ఎమ్మెల్యేగా ముందు నిలవటం అంటే



చంద్రబాబు నాయుడు తనకు ఇచ్చిన గుర్తింపే అన్నారు. చంద్రబాబు నాయుడు, ప్రజలు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గళ్ళా మాధవి హామీనిచ్చారు.

7
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 17, జూలై 2024

# బాధితులకు సత్వర న్యాయం చేయాలి

◆ **మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి**

**గుంటూరు, మహానాడు:**

బాధితులకు సత్వర న్యాయం చేయాలని మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి అన్నారు. చేబ్రోలులో 8వ తరగతి విద్యార్థిని శైలజ అనుమానస్పద మృతిపై గుంటూరు మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో మహిళా మోర్చా ఉపాధ్యక్షులు సైదారాణి, కోశాధికారి డాక్టర్ స్రవంతి, కార్యదర్శి మహాలక్ష్మి బాధిత కుటుంబ సభ్యులను గుంటూరు జీజీహెచ్‌లో పరామర్శించారు. ఘటన గురించి వారు వాకబు చేశారు. శైలజ మేనత్త నిందితుణ్ణి త్వరగా పట్టుకొని తమ బిడ్డ మరణానికి కారణమైన అతన్ని ఉరి తెస్తే కానీ మాకు న్యాయం జరిగినట్టుగా భావించం అని ఆవేదన



వ్యక్తం చేయగా నాగమల్లేశ్వరి వారికి సత్వర న్యాయం జరిగేలా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు.



## ఐజీని కలిసిన పత్తిపాటి పుల్లారావు

**గుంటూరు, మహానాడు:**

గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని గుంటూరులోని డి.ఐ.జి కార్యాలయంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మర్యాద పూర్వకంగా కలిశారు.

## టి సాట్ ప్రసారాలకు ఎటువంటి ఇబ్బంది లేదు

◆ **సీఈఓ వేణుగోపాల్ రెడ్డి**

**హైదరాబాద్,మహానాడు:**



టి -సాట్ నెట్వర్క్ ఛానల్స్ ప్రసారాలకు ఎటువంటి ఇబ్బంది లేదని సీఈఓ బొదనపల్లి వేణు గోపాల్ రెడ్డి స్పష్టం చేసారు. జి సాట్ 8 సిగ్నల్‌లో టి సాట్ విద్య, నిపుణ ఛానల్స్ ప్రసారాలు యాద విధిగా కొనసాగుతున్నాయని ప్రకటించారు. జి సాట్ 16 టెస్ట్ సిగ్నల్ మాత్రమే. ప్రస్తుతం టి సాట్ ప్రసారాలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. టి సాట్ ప్రేక్షకులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరలో కొత్త జీ శాట్ 16 ఒప్పందం చేసుకోబోతున్నామని వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## సైనికుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

◆ **మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్**

**అమరావతి,మహానాడు:**



జమ్మూకాశ్మీర్లో జరిగిన ఎదురుకాల్పుల్లో సైనికులు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్. జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు సైనికులు వీరమరణం పొందడంపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దేశ రక్షణలో వీరి సేవలు చిరస్మరణీయమన్నారు. వారి త్యాగాలు మరువలేనివన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన సనపల జగదీశ్వరరావు, డొక్కరి రాజేష్ కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా ప్రసన్నకుమార్

**అమరావతి, మహానాడు:**



ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్న కుమార్ నియామకం ఖరారైంది. ఇటీవల సెక్రటరీ జనరల్ పదవికి రామాచార్యులు రాజీనామా చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో సెక్రటరీ జనరల్ పదవిని మండలి భర్తీ చేసింది. సూర్యదేవర ప్రసన్నకుమార్ గతంలో వివిధ ఉన్నత పదవులు చేపట్టారు.



**అమరావతి జూలై 16, 2024:**

శాసన సభ కార్యాలయంలో స్పీకర్ శ్రీ అయ్యన్న పాత్రుడు చింతకాయలని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్







## మంత్రి డోలాను కలిసిన పలువురు ముఖ్య కార్యదర్శులు

**వెలగపూడి,మహానాడు:**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, గ్రామ వార్డు సచివాలయాల, వాలంటీర్ల శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు మంగళవారం నాడు వెలగపూడిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె.కన్న బాబు, గ్రామ, వార్డు సచివాలయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.సూర్యకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన పలు అంశాలపై మంత్రితో విడివిడిగా చర్చించారు.

## గల్ఫ్ వర్కర్స్ సంరక్షణపై దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ నాగరాణి

◆ **రిజిస్టర్ ఏజెన్సీల ద్వారా మాత్రమే గల్ఫ్‌కి వెళ్ళేలా చర్యలు**

◆ **ఉపాధి పొందేందుకు వెళ్లే మహిళలకు ప్రత్యేక శిక్షణకు కార్యాచరణ**

◆ **మహిళలు మోసపోకూడదన్న లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ముందడుగు**

**భీమవరం జూలై 16,మహానాడు:**

గల్ఫ్ వలస కారణంగా ఏ మహిళ మోసపోకూడదనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక కార్యచరణతో రంగంలోకి దిగారు. గల్ఫ్ దేశానికి ఉపాధి కోసం వెళ్లి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా వర్కర్ల ఆవేదనను ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా తెలుసుకున్న కలెక్టర్ నివారణ చర్యలపై దృష్టి సారించారు.

ఆ క్రమంలో మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ చాంబర్లో ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో గల్ఫ్ సురక్షిత వలసలపై సమీక్షించారు. మహిళలు ఏజెన్సీల ద్వారా మోసపోకుండా, నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణతో పాటు సురక్షితమైన మార్గం ద్వారా గల్ఫ్‌కు పంపేందుకు తగిన కార్యాచరణ అమలకు చర్యలు తీసుకోనున్నామని ఈ సందర్భంగా నాగరాణి వివరించారు.



ఉపాధి కోసం విదేశాలకు ఎలా వెళ్లాలి, ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు ఏం కావాలి, ఏజెన్సీ సురక్షితమైనదా కాదా, తొలుత ఎవరిని సంప్రదించాలి, శిక్షణ ఎలా పొందాలి తదితర విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా స్థాయిలో తొలుత "గల్ఫ్ వర్కర్స్ సహాయ కేంద్రం" ప్రారంభించనున్నట్లు వివరించారు.

కేంద్ర నిర్వహణ విధి విధానాలపై డి ఆర్ డి ఏ, పోలీస్, ఐ సి డి ఎస్, కార్మిక శాఖల సిబ్బందితో టీమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు ఆరవ తేదీన గుర్తింపు పొందిన, పొందని ఏజెన్సీలతో వర్క్ షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

తొలుత గల్ఫ్‌కు వెళ్లే మహిళలను గుర్తించి, వర్క్ షాప్‌నందు వారికి పూర్తి అవగాహన కలిగిస్తామన్నారు. అనంతరం వారికి వంటలో నిపుణత, భాష, బేబీ కేరింగ్, హౌస్ కీపింగ్ తదితర అంశాలపై పూర్తి శిక్షణను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అయితే జిల్లాలో ఉపాధి మార్గాలు మెండుగా ఉన్నాయని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని నాగరాణి కోరారు. కుటుంబ సభ్యులకు దూరమై సుధూర ప్రాంతాలకు వెళ్లేవారు జిల్లాలో ఉపాధి మార్గాలను తెలుసుకోవాలన్నారు.

జూమ్ ద్వారా పాల్గొన్న ఐఎల్ఓ ప్రతినిధి నెహ్వా అద్వానీ, ఇంటర్నేషనల్ నాన్ రెసిడెంట్స్ తెలుగు ఆర్గనైజేషన్ సీఈవో హేమ గల్ఫ్ కు వెళ్లే మహిళ వర్కర్ల భద్రత, సురక్షిత ప్రయాణం పై సూచనలు చేసారు. పశ్చిమ గోదావరి జిల్లాలో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

ఈ సమావేశంలో ఓవర్సీస్ మ్యాన్ పవర్ జిఎం బి.ఆర్ క్రాంతి కుమారి, హెచ్ ఆర్ మేనేజర్ బి.సతీష్ బాబు, డిఆర్డిఏ పిడి ఎమ్మెస్ఎస్ వేణుగోపాల్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి, జిల్లా నైపుణ్య శిక్షణ అభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మైనారిటీలకు గొడుగు పట్టింది టీడీపీనే

◆ **మంత్రి ఎన్ ఎండీ ఫరూక్**

**అమరావతి,మహానాడు:**

రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి పునాదుల వేసింది టిడిపి అని న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. హోటల్ డివి మానర్‌లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమవేశంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మైనారిటి హక్కుల పరిరక్షణ సమితి అద్యక్షులు ఫరూక్ షుబ్లీ అద్యక్షత వహించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. తెలగుదేశం పార్టీ పుట్టిన్నాటినుంచి మైనారిటీల అభ్యున్నతికి మాత్రమే కృషి చేసిందన్నారు. కాంగ్రెస్, వైసీపీలు మైనారిటీ ఓట్లకోసం మాత్రమే వాడుకుని వదిలేశారన్నారు. టీడీపీ ఆదినుంచి ముస్లింలను అక్కున చేర్చుకుని ఆదుకుంటూ వచ్చిందన్నారు . ముస్లింలకు ఎటువంటి సమస్య వచ్చినా టిడిపి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉందన్నారు.

ఆనాడు ఎన్టీఆర్ నుంచి ఇప్పటి చంద్రబాబు వరకు మైనారిటీల సంక్షేమం మొదటి ప్రాధ్యాన్యతతో పనిచేస్తు పోతున్నామని మంత్రి ఫరూక్ వెల్లడించారు. తమ ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు సువర్ణ యుగం ప్రారంభమైందన్నారు. భవిషత్తులో మైనార్టీల అభివృద్ధి వేగవంతగా సాగుతుందని అభయమిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్తానిక ఎమ్మెల్లేలు బోడె ప్రసాద్, సుజనా చౌదరి, మాజీ పోలీసు అదికారి ఏ బి వెంకటేశ్వరరావు , టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు టిడి జనార్ధన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 62 శాతం సీట్ల భర్తీ

◆ **సాంకేతిక విద్యా శాఖ సంచాలకురాలు డాక్టర్ నవ్య**

◆ **ముగిసిన పాలిసెట్ తుదిదశ ప్రవేశాల ప్రక్రియ**

◆ **జులై 20లోపు పాలిటిక్నిక్‌లలో విద్యార్థుల రిపోర్టింగ్**

**అమరావతి,మహానాడు:**

తుది దశ కౌన్సిలింగ్ ముగిసిన తరువాత రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రవేటు కళాశాలల్లో 46 శాతం కన్వీనర్ కోటా సీట్టు భర్తీ అయ్యాయని సాంకతిక విద్యా శాఖ సంచాలకురాలు, ప్రవేశాల కన్వీనర్ డాక్టర్ బి నవ్య తెలిపారు. మొత్తం 262 విద్యా సంస్థలలో 81,420 సీట్లు ఉండగా, 37,036 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్ లలో 17,943 సీట్లు ఉండగా, 62 శాతం మేర 11,042 సీట్లు భర్తీ అయ్యాయన్నారు.

ప్రైవేటు సంస్థల పరంగా 174 పాలిటెక్నిక్‌లలో 63,477 సీట్లు ఉండగా, 41 శాతం మేర 37,483 సీట్లు భర్తీ చేసామని కన్వీనర్ తెలిపారు. పాలిసెట్ 2024లో అర్హత పొందిన అభ్యర్థుల సంఖ్య 1,24,430 కాగా, చివరి దశలో 2,307 మంది అభ్యర్థుల నమోదు చేసుకున్నారు. చివరి దశ వరకు నమోదు చేసుకున్న మొత్తం అభ్యర్థులు 43,618 మంది కాగా, వారిలో 41,390 అభ్యర్థులు అర్హత సాధించారు. చివరి దశలో ఎంపికలను 13,080 అభ్యర్థులు సద్వినియోగం చేసుకున్నారు.

తుదిదశలో తాజా అడ్మిషన్ల సంఖ్య 6,780గా నమోదైందన్నారు. ఇప్పటికే తరగతులు ప్రారంభం అయినందున చివరి దశలో సీట్లు పొందిన విద్యార్థులు గురువారం నుండి జులై 20వ తేదీ లోపు అయా కళాశాలల్లో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత రిపోర్టింగ్, కళాశాలలో రిపోర్టింగ్ రెండింటినీ పూర్తి చేయవలసి ఉందని డాక్టర్ బి.నవ్య వివరించారు.

08
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 17, జులై 2024

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్**

గుంటూరు, మహానాడు:
సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులకు తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఉదయం తాడికొండ లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, బీసీ బాలికల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు.

ముందుగా సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట గది మరియు డైనింగ్ హాల్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు అందించే అల్పాహారం, భోజనం మెనూ ప్రకారం రుచిగా, సుచిగా అందించాలన్నారు. తరగతి గదులను పరిశీలించి వారికి అందిస్తున్న విద్యాభోదనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

పదవ తరగతి విద్యార్థులతో మమేకమై జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయురాలిగా మారి కొంత సమయం వారితో ముచ్చటించారు. ఇంగ్లీష్ పాఠ్య పుస్తకం చదవడం లో విద్యార్థికి వున్న ప్రతిభను పరీక్షించారు. విద్యార్థులకు రోజు వారీగా పాఠ్య పుస్తకంలోని పాఠాన్ని చదివించాలని, అలాంటప్పుడే విద్యార్థులు మంచి తర్ఫీదు పొందగలరని ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ సూచించారు. పాఠ్య పుస్తకాన్ని చదవడం లోనే విద్యార్థులు ఇబ్బందులు పడితే, ఆ పాఠాన్ని వారు అర్ధం చేసుకొని పరీక్షలను ఎలా ఎదుర్కొగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో స్టాండర్డ్ పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉందని సూచించారు.

అనంతరం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో వారికి లెక్కల పై ఏ మాత్రం అవగాహన ఉందో తెలుసుకోవడానికి వారిని పరీక్షించారు. ఇంతకు క్రితమే అభ్యాసం పూర్తైన లెక్కల చాప్టర్ నుండి బోర్డ్‌పై లెక్కను రాసి పరిష్కరించాల్సిందిగా విద్యార్థులను కొరారు. విద్యార్థులు లెక్క పరిష్కారంలో తడబాటు పడటం చూసి విద్యార్థులకు మరింతగా తర్ఫీదు ఇవ్వాలని గణిత ఉపాధ్యాయునికి సూచించారు. విద్యార్థులు ఏయే సబ్జెక్ట్ లలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అందించాలన్నారు.

బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిల్వ వున్న వర్షపు నీటిలో లార్వ పెరగకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్, యాంటీ మలేరియా మందులు వేసి మలేరియా వంటి జబ్బులు



ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. విద్యార్థులు బస చేసే గదులను, టాయిలెట్లను పరిశీలించి, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస చేసే గదుల్లోకి దోమలు, ఈగలు వంటి కీటకాలు ప్రవేశించకుండా వుండేందుకు కీటికిలకు మెష్ లను వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు.

అనంతరం బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వసతి గృహం లోని విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న ఆహారం ఎలా ఉందని, సమయానికి ఆహారం అందిస్తునారా అని ఆరా తీశారు. వంట గదిని పరిశీలించి మరింత శుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహం నుండి బయటకు వెళ్ళే డ్రైనేజి వ్యవస్థ సరిగా లేదని వసతి గృహం అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా డ్రైనేజిని బాగు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఈఓ పిఆర్‌డి వెంకటేశ్వర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

వసతి గృహంలో మరింతగా పారిశుద్యం పనులు చేపట్టి విద్యార్థినీలకు సౌకర్యవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.


ఈ వసతి గృహాల తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదన్, తాడికొండ తహశీల్దార్ మధుసూదనరావు, మండల ప్రత్యేక అధికారి, పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు సుధాకర్, గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ కె.పద్మజ, సమగ్ర శిక్ష అడిషనల్ కో-ఆర్డినేటర్ జి.విజయ లక్ష్మీ, మండల విద్యా శాఖ అధికారిణి ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# తమిళ యూట్యూబర్ అరెస్టు

- సర్వదర్శనం క్యూలైన్లో ప్రాంక్ వీడియోలు వీవీవాసన్

తిరుమల,మహానాడు:
శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల సర్వదర్శనం క్యూలైన్లో ప్రాంక్ వీడియోలు చేసిన తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన యూట్యూబర్ వి.వైకుంఠవాసన్ (వీవీ వాసన్), ఇతని స్నేహితుడు గోవిందరాజ రామస్వామిని తిరుమల టూటౌన్ పోలీసులు సోమ వారం అరెస్టు చేశారు.

వీడియోలు ఇటీవల సామాజిక మాధ్య మాల్లో వైరల్ కావడం, భక్తుల నుంచి పెద్దఎత్తున అభ్యంతరం వ్యక్తం కావడం తెలిసిందే. ఆలయ గౌరవానికి భంగం కలిగిం చడం, భక్తుల మనోభావాలు దెబ్బతీయడం, శాంతిభద్రతల సమస్యకు కారణమవడం వంటివాటిపై తితిదే ఐటీలోని సైబర్ సెక్యూరిటీ విభాగం అధికారి తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ సత్యనారాయణ నిందితులను



అరెస్ట్ చేశారు.

వారిని తిరుమలకు తీసుకువచ్చాక పూర్తిగా విచారించి వీడియో చేయడానికి గల కారణాలు, అసలు ఉద్దేశాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా మరిన్ని సెక్షన్లు జోడించి నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

# ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడండి

- మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, మహానాడు:
వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా అధికారులు స్పందించక పోవడం పట్ల ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు, చుట్టూ ఉన్న ప్రాంతాల్లో కోట్ల విలువైన భూములను కబ్జాదారులు చెరబట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉన్నతాధికారులకు ఆయన ఒక లేఖ రాశారు.

ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి ఫిర్యాదుతో మంత్రి అధికారులను అప్రమత్తం చేసారు. ఆమె ఫిర్యాదును ప్రస్తావిస్తూ ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఉదాసీనత ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్ట్ మెంటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ, హెచ్ ఎండీఏ కమిషనర్లకు శ్రీధర్ బాబు ఈ లేఖను రాశారు.

ఖానామెట్ రెవిన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 41/14 లోని 252.24 ఎకరాల భూమి ఉండగా 2008లో అప్పటి ప్రభుత్వం 180.13 ఎకరాలను హుడా (ప్రస్తుత హెచ్ ఎండీఏ) కు కేటాయించింది. అందులో నుంచి 75 ఎకరాలను పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ప్రస్తుత టిజిఐఐసి)కు హుడా బదిలీ చేసింది. హుడా ఆధీనంలోని 105.13 ఎకరాలు, టిజిఐఐసి యాజమాన్యంలోని 75 ఎకరాల్లో అత్యధిక భాగం కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్లిందని శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు.



శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామంలోని 100, 101 సర్వే నంబర్లలోని 100 ఎకరాల భూమిపై కబ్జా యత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రజావసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించి తక్షణం కార్యరంగంలోకి దిగాలని సూచించారు.

నిర్దిష్ట కాలవ్యవధిలో సమీక్షలు నిర్వహించి క్షేత్ర స్థాయి సిబ్బందికి బాధ్యతను నిర్దేశించాలని శ్రీధర్ బాబు చెప్పారు. ఆక్రమణల సమాచారం ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# మాటలు, మూటలు, ముఠాలతోనే కాంగ్రెస్ పాలన

- ప్రజాపాలన గాలికి.. కొత్త రేషన్ కార్డుల జారీ ఇంకెప్పుడు?
- కాంగ్రెస్ సర్కారు విద్యార్థి, యువజన, నిరుద్యోగుల విరోధి.
- పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు
- సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు నో
- ఉన్నతవిద్యకు పేద విద్యార్థులు దూరం
- ఎంఎస్ఎంఈలకు ఆగిపోయిన సబ్సిడీలు
- రూ.3,300 కోట్లకు పైగా బకాయిలుపెండింగ్
- నత్తనడకన ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం స్కాం విచారణ
- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

హైదరాబాద్, మహానాడు:
రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసి, కేవలం మాటలు, మూటలు, ముఠాలతోనే కాలం వెళ్లదీస్తోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు.

విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, రైతులకు అనేక రకాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో మాత్రం వెనుకడుగు వేస్తోందన్నారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను ఏర్పాటు చేసుకున్నవారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న రూ. 3,300 కోట్ల బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా కూడా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యారంటీ పథకాలను రేషన్ కార్డు ఉన్నవారికే ఇస్తామని చెప్పడంతో కార్డులు లేని వాళ్లు ఆ పథకాలను అందుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టులో స్కాం, సెక్రటేరియట్ నిర్మాణంలో అత్యధిక వ్యయానికి సంబంధించిన అంశాలపై విచారణ జరపడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకడగు వేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలు కొండలా పేరుకుపోయాయన్నారు. ముఖ్యమంత్రి నుంచి మొదలు సంబంధిత మంత్రుల వరకు ఫీజు రీయింబర్స్ మెంట్ త్వరలోనే చెల్లిస్తామని మాటలు చెప్పారు. ఇంతవరకు బకాయిలు చెల్లించింది లేదు. విద్యాసంస్థలకు ప్రభుత్వం సుమారు రూ.6500 కోట్ల బకాయిలు చెల్లించాలి.

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు నిలిచిపోయాయి. సబ్సిడీ బకాయిలు చెల్లించాలి. రాష్ట్రంలో 15 వేల చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం వివిధ రకాల సబ్సిడీ కింద సుమారు రూ.3,300 కోట్ల బకాయిపడింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటంతో విద్యాసంస్థల మేనేజ్‌మెంట్లు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రుణాల మాఫీ పథకం అమలుకు కమిటీని నియమించినట్లు తెలిపింది. కాని, అమలులో మాత్రం ముందడుగు వేయలేదు.

ప్రతి ప్రభుత్వ పథకానికి రేషన్ కార్డే ప్రామాణికం.. వివిధ రకాల ఉపకార వేతనాలు అందాలన్నా రేషన్ కార్డే ముఖ్యం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా కూడా రేషన్ కార్డుల ఊసెత్తక పోవడంతో కార్డులు లేని వాళ్లు ప్రభుత్వ పథకాలను అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

ప్రజాపాలన అంటూ మాటలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి కేవలం మాటలకే పరిమితమయ్యారు. ప్రజాభవన్ లో తొలినాళ్లలో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. క్రమేణా తగ్గుతూ పదుల సంఖ్యకు పడిపోయింది. ముఠాలు కట్టడంలో ఆరితేరిన కాంగ్రెస్ నాయకులు.. మూటలను ఢిల్లీకి పంపడమే కర్తవ్యంగా పెట్టుకున్నారు.ఇప్పుడు శాసనసభ సమావేశాలు నిర్వహించి ఉద్ధరిస్తామంటూ వ్యవహారం నడుపుతున్నారు.

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, డ్రగ్స్ కేసు, సెక్రటేరియట్ నిర్మాణంలో భారీ వ్యయానికి సంబంధించిన విషయాల్లో విచారణ మూడు అడుగులు ముందుకు.. ఏడడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రభుత్వ నియామకాలకు సంబంధించి పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండటం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు.

ఒక్కో పోటీ పరీక్ష మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉండాలి. కాని, విద్యార్థులే, నిరుద్యోగుల మధ్య గొందరగోళం నెలకొంది.

వైద్యశాఖలో అత్యవసర సేవలు అందించే గాంధీ, ఉస్మానియా, నీలోఫర్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుక్కొనే పరిస్థితి ఎదురైంది. ఈ అంశాలపై భారతీయ జనతా పార్టీ ప్రజల్లోకి వెళ్లి పోరాటం చేస్తుంది.

# రైతు రుణమాఫీ మార్గదర్శకాలు నిలిపివేయాలి

- ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింప చేయాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్,మహానాడు:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు కోసం విడుదల చేసిన మార్గదర్శకాలు ఆర్థిక భారాన్ని తగ్గించు కునే ప్రయత్నం గానూ, వీటి వలన లక్షలాదిమందికి రుణ మాఫీ అందకుండా పోతుందని, ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు సవరించి షరతులు ఎత్తివేసి కట్ ఆఫ్ తేదీల మధ్య ఉన్న పంట రుణాలన్నీ మాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు.


కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఆచరణలోకి వచ్చేసరికి అందరికీ రుణమాఫీ చెందకుండా షరతుల విధించడం సమంజసం కాదన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ కొందరికి చేసి, కొందరికి ఎగనామా పెట్టడంతో రైతుల ఆగ్రహానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ అందిస్తామని చెబుతూనే, కుటుంబాన్ని నిర్ధారించడానికి ఆహార భద్రత కార్డు ప్రామాణికంగా తీసుకుంటామని, రైతు రుణ ఖాతా ఆధార్, పాస్ బుక్ ఆధార్, రేషన్ కార్డ్ ఆధార్ లింకు ఆధారంగా రుణమాఫీ అమలు చేస్తామని, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధానమంత్రి కిసాన్ పథకం మినహాయింపులను పరిగణలోకి తీసుకోవాలని మార్గదర్శకాలలో చెప్పడం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ ఎన్నికల వాగ్దానాన్ని తుంగలో తొక్కడమే అవుతుందన్నారు.


ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు మాత్రమే ఇటువంటి షరతులు పెడుతుందని విమర్శించారు. కుటుంబం నిర్ధారించుకోవడానికి రేషన్ కార్డు ప్రామాణికం అవసరం లేదని, భార్యాభర్తలు, మైనర్ పిల్లలు కుటుంబంగా పరిగణిస్తారని గత రుణమాఫీ సమయంలో ఇదే పద్ధతి అనుసరించారని, ఇప్పుడు అదే పద్ధతి అనుసరించవచ్చని, రేషన్ కార్డు ప్రామాణికం అయితే అనేకమందికి రేషన్ కార్డులు లేవని, గత పది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఉన్న కార్డులో కూడా చాలామందికి వివాహాలు అయి వారు వేరే కుటుంబం గా మారారని, దీనివలన అనేకమంది రుణమాఫీకి దూరమవుతారని పిఎం కిసాన్ మినహాయింపులను పరిగణ లోకి తీసుకోవడం అంటే రాష్ట్ర ప్రభుత్వానికి రుణమాఫీ అమలు పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులు ఉంటే కొద్దిమంది రైతు కుటుంబాలు మాత్రమే పీఎం కిసాన్ అందుతున్నదని అన్నారు. ఒకవైపు ప్రతి రైతుకు రుణమాఫీ అందిస్తామని చెబుతూనే మరోవైపు ఇటువంటి షరతులు పెట్టి కోతలు పెడుతుందని విమర్శించారు. రీ షెడ్యూల్ చేసిన రుణా లకు మాఫీ వర్తించదని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదని. కరువు, వరదలు వచ్చినప్పుడు రుణాలు రీ షెడ్యూల్ చేసు కున్నారని, గత ప్రభుత్వం కూడా రీ షెడ్యూల్ చేసుకున్న రైతులకు అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తుందన్నారు.

రెండు లక్షలకు మించి ఉన్న మొత్తం కడితేనే మాఫీ వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. అందరికీ రుణమాఫీ వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయని, ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు నిలుపుదల చేసి ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, కాలయాపన చేయకుండా తక్షణం రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేసింది. లేనిచో ప్రజల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని అన్నారు.



**అమరావతిలోని సచివాలయంలో మంగళవారం రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు, ఏపీ సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్**






09

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 17, జూలై 2024


## పిన్నెల్లికి ఒక రూల్... పీవీ సునీల్ కుమార్, సీతారామాంజనేయులుకు

# మరొక రూల్ ఉండకూడదు కదా?

- సునీల్ అన్న అమెరికా టూర్లకు డబ్బెక్కడిది?
- సునీల్ కుమార్ చేతిలో ఎక్కువమంది దెబ్బలు తిన్నది దళితులే
- ప్రవీణ్‌కుమార్‌వి లేకిమాటలు
- నన్ను చంపటానికి అప్పుడే కుట్ర
- దళితులకు అన్యాయం జరిగినప్పుడు ఈ స్వయం ప్రకటిత దళిత నాయకుడు ఎక్కడున్నాడు?
- నేనొక దళిత వాదిని... డాక్టర్ సుధాకర్, సుబ్రహ్మణ్యంలపై జరిగిన దాష్టికాన్ని ఖండించిన వారిని నేను ముందు వరుస లోనే ఉన్నాను
- నాపై ద్వేషాన్ని పెంచే విధంగా దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసి పీవీ సునీల్ కుమార్ విఫలమయ్యాడు
- ప్రజలు తెలివైన వాళ్ళు... ఎవరికి అన్యాయం జరిగింది ఎవరు దుర్మార్గులు అనేది వారికి తెలుసు
- ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు

ఉండి:

రాష్ట్రంలో దళితులకు అన్యాయం జరిగినప్పుడు ఈ స్వయం ప్రకటిక దళిత నాయకుడైన పీవీ సునీల్ కుమార్ ఎక్కడ ఉన్నాడని ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు ప్రశ్నించారు. దళితులకు అన్యాయం జరిగిన ఏనాడు స్పందించలేదని, అధికారంలో ఉన్న వారి మెప్పు కోసమే వారికి ఊడిగం చేశారని మండిపడ్డారు.

డాక్టర్ సుధాకర్ ను కాళ్లు చేతులు విరిచి కట్టి నడిరోడ్డుపై హింసించినప్పుడు పీవీ సునీల్ కుమార్ ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్నించారు. సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసినప్పుడు పీవీ సునీల్ కుమార్ గొంతు ఎందుకు మూగబోయిందని నిలదీశారు. పీవీ సునీల్ కుమార్‌పై నేను చేసిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేయగానే, దీన్ని ఒక కులాల మధ్య వైషమ్యంగా చిత్రీకరించేందుకు పీవీ సునీల్ కుమార్ ప్రయత్నించి విఫలమయ్యారు.

నా మీద ద్వేషం వచ్చే విధంగా జనాలని సమకూర్చాలని పాపం చాలా ప్రయత్నించి విఫలమయ్యాడు. ప్రజలు తెలివైన వాళ్ళు ఎవరికి అన్యాయం జరిగిందో, ఎవరు దుర్మార్గు లో వారికి తెలుసునని రఘురామకృష్ణం రాజు అన్నారు. మంగళవారం నాడు ఉండి నియోజకవర్గం కేంద్రంలో ఆయన మీడియా ప్రతినిధులతో పలు అంశాలపై మాట్లాడారు. పీవీ సునీల్ కుమార్ విఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నాడని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయన దరఖాస్తును తిరస్కరించాలి.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలి. నాపై జరిగిన హత్యాయత్నం కేసులో ఆధారాలు పక్కాగా ఉన్నాయి. ఇందులో ఎవరి పాత్ర ఏమిటో కచ్చితంగా బయటకు వస్తుంది. త్వరలోనే విచారణ మొదలవుతుందని ఆశిస్తున్నాను. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి. ఐపీసీ 307 సెక్షన్ కింద కేసు నమోదైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేశారని గుర్తుచేసిన రఘురామకృష్ణం రాజు, పిన్నెల్లికి ఒక రూల్... పీవీ సునీల్ కుమార్, సీతారామాంజనేయులు కు ఒక రూల్ ఉండకూడదు కదా? అని ప్రశ్నించారు.

### ఐదేళ్లలో అమెరికాకు ఎన్నోసార్లు వెళ్లి వచ్చిన సునీల్ కుమార్

నిజాయితీ కలిగిన ఒక ప్రభుత్వ ఉద్యోగిగా తనకు తాను చెప్పుకునే పీవీ సునీల్ కుమార్ గత ఐదేళ్లలో ఎన్నోసార్లు అమెరికాకు వెళ్లి వచ్చారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. అమెరికాకు వెళ్లి రావడానికి టికెట్ల ఖర్చు ఎంత అవుతుంది అని ప్రశ్నించిన ఆయన, ఆయన జీతం మొత్తం అమెరికాకు వెళ్లి వచ్చిన టికెట్లకే సరిపోతుందన్నారు.

ప్రముఖుల సహకారంతోనే పీవీ సునీల్ కుమార్ అనేక సార్లు అమెరికాకు వెళ్లి వచ్చారన్నారు. హత్యాయత్నం కేసులో పీవీ సునీల్ కుమార్ ను వదిలేస్తే తప్పించుకుపోయే ప్రమాదం ఉందన్నారు. పీవీ సునీల్ కుమార్‌తో పాటు ఇతరులు చేసిన చెత్త వాదనలకు నేను ఇప్పటికే ఎన్నో టీవీ ఛానళ్లలో వివరణ ఇచ్చానని పేర్కొన్నారు.

### నన్ను చంపడానికి ముందే కుట్ర చేశారని ఆనాటి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో స్పష్టం

2021 మే 14వ తేదీన నన్ను అరెస్టు చేయడానికి ముందే, చంపడానికి పథక రచన చేసినట్లు అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఇచ్చిన ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా స్పష్టమవుతోందని రఘురామకృష్ణం రాజు తెలిపారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్‌గా పనిచేసే శ్రీకాంత్‌తో పాటు ఆయన బృందం ఎమర్జెన్సీ వైద్య సహాయానికి అందుబాటులో ఉండాలని, అలాగే సూపరిండెంట్ మొబైల్ ఫోన్లో తక్షణమే స్పందించాలని ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీకాంత్ అనే కార్డియాలజిస్ట్ పనిచేస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్‌కు ఎలా తెలుసునని రఘురామ కృష్ణంరాజు ప్రశ్నించారు. కలెక్టర్‌కు ఎవరో చెప్పి ప్రత్యేకంగా శ్రీకాంత్ పేరును ఉత్తర్వులలో పొందుపరిచే విధంగా జాగ్రత్తలను తీసుకున్నారన్నారు. అదే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ పేరును మాత్రం, ఆ ప్రత్యేక ఉత్తర్వులలో మెన్షన్ చేయలేదన్నారు.

2021 మే 14వ తేదీ సాయంత్రం 4:30 గంటలకు నన్ను అరెస్టు చేశారు. అంతకుముందే ఈ ప్రత్యేక ఉత్తర్వులను ఇచ్చి ఉంటే అరెస్టుకు ముందే కుట్ర చేసినట్లు అర్థమవుతుంది. ఒకవేళ నాలుగున్నర గంటల తర్వాత ఇచ్చారనుకుందాం... అప్పుడు ఈ ప్రత్యేక ఉత్తర్వులలో కచ్చితంగా నా పేరు పొందుపరిచి ఉండాలి. ప్రత్యేక పరిస్థితుల్లో వైద్యం అందించడానికి కార్డియాలజిస్ట్ అతని టీం రెడీగా ఉండాలని ఆదేశించాలి. అలా కాలేదంటే దీని భావం ఏమిటో ఇట్టే అర్థమవుతుందన్నారు. లక్కీగా ఈ ప్రత్యేక ఉత్తర్వుల కాపీ నా చేతికి వచ్చిందని తెలిపారు.

### మంచం కోళ్లు విరిగేలా నా గుండెలపై కూర్చున్నారు

ఆరు నెలల క్రితమే గుండె ఆపరేషన్ చేయించుకున్న నా చాతిపై బలంగా మంచం కోళ్లు విరిగే విధంగా కూర్చున్నారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. బలంగా చాతిపై కూర్చోవడం ద్వారా నేను చనిపోతే అప్పటికే రెడీగా ఉన్న కార్డియాలజిస్ట్ అతని టీం, ఎంతో ప్రయత్నించిన విగత జీవుడయ్యారని పేర్కొని ఉండేవారన్నారు. అరెస్టు చేయడంతో ఆందోళనకు గురైన రఘురామకృష్ణం రాజు గుండెపోటుకు గురయ్యారని చెప్పి ఉండేవారన్నారు. ఆ తెల్లారి జగన్మోహన్ రెడ్డి ముత్యాల ముగ్గు చిత్రంలో రావు గోపాల్ రావు మాదిరిగా వచ్చి నా దండ వేసి ఉండేవారని పేర్కొన్నారు.

ఈ తరహా చెత్త ఆర్డర్‌ను కలెక్టర్ ఇవ్వరని పేర్కొన్న రఘురామకృష్ణం రాజు.. ఎమర్జెన్సీ మెడికల్ ఇష్యూ కోసం పోలీసులకు కాపీని పంపి, శ్రీకాంత్ అనే వైద్యున్ని అందుబాటులో ఉండాలని చెప్పి ఒక స్కెచ్ వేశారన్నారు.నేను చస్తానని వారు అనుకున్నారు. కానీ నేను చావలేదు. ఇప్పుడు వారి చావుకు వచ్చింది. దీని ద్వారా నాపై కుట్ర ఏ స్థాయిలో జరిగిందో వివేక్ యాదవ్ ఇచ్చిన ఆర్డర్ కాపీ ద్వారా స్పష్టమవుతుందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

### సికింద్రాబాద్ మిలిటరీ ఆసుపత్రి వైద్య నివేదికలో ఎకిమోసిస్ స్పష్టంగా వెల్లడి

సికింద్రాబాద్ మిలిటరీ ఆసుపత్రి వైద్య నివేదికలో పోలీసులు చిత్రహింసలకు గురి చేయడం వల్లే నా కాలి వేలు రెండు చోట్ల విరిగినట్లు, రక్తం గడ్డ కట్టినట్లు, అరి కాళ్లపై నల్లటి చారలు పేరుకుపోయినట్టు కల్నల్ స్థాయి అధికారి సమక్షంలో, ప్రస్తుత హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించి వైద్య నివేదికను రూపొందించడం జరిగిందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. దీనితో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం తప్పుడు వైద్య నివేదికను ఇచ్చినట్లు తేలిపోయింది.

అమాయక సునీల్ కుమార్, తింగరి సుధాకర్ రెడ్డి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య నివేదిక ఆధారంగా నోటి కొచ్చినట్లు మాట్లాడారు. పీవీ సునీల్ కుమార్‌ను అమాయక సునీల్ కుమార్ అనడం వెనుక, తొందరగా డిజిపి అయిపోవాలనుకుని ఇలా అయిపోయారని, అందుకే అమాయక సునీల్ అన్నానని తెలిపారు. ఎకిమోసిస్ అనే వైద్య భాష పదాన్ని మిలిటరీ ఆసుపత్రి వైద్య బృందం తమ నివేదికలో పేర్కొన్నారని, దీని అర్థం ఎక్స్టర్నల్ ప్రెషర్ వల్ల ఏర్పడిన గాయం కారణంగా రక్తం గడ్డ కట్టడాన్ని ఎకిమోసిస్‌గా పేర్కొంటారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

### 15 రోజుల తర్వాత బెయిల్ బాండ్స్ సమర్పించాలన్న సుప్రీంకోర్టు

బెయిల్ పేపర్ బాండ్స్ సమర్పించనిదే జైలు నుంచి విడుదల చేయరని, అటువంటిది 15 రోజుల లోపు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత బెయిల్ బాండ్స్ సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించిందని రఘురామ కృష్ణంరాజు గుర్తు చేశారు. సికింద్రాబాద్ మిలటరీ ఆసుపత్రి సమర్పించిన వైద్య నివేదిక ఆధారంగా సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, అందులో ప్రధానంగా ఎకిమోసిస్ అనే వైద్య భాష పదాన్ని చూసి దాడి జరిగిందన్న అంశాన్ని తోసిపుచ్చలేమని, బెయిల్ మంజూరు చేస్తున్నట్లుగా పేర్కొందన్నారు.

అయినా కొట్టలేదని పివి సునీల్ కుమార్, గాయాలు లేవని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి వైద్య నివేదికను అంతా అబద్ధమని తేలిపోయింది. గుంటూరు నుంచి హైదరాబాదుకు వెళ్లే దారిలో రఘురామ కృష్ణంరాజు తనని తానే కొట్టుకొని ఉంటారని, పీవీ సునీల్ కుమార్ తొందరపడి చేసిన వాదన ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకొనుంది. ఆరోజు నాతోపాటు పోలీసు సిబ్బంది రక్షణగా ఉన్నారని గుర్తు చేశారు.

కందిపోయిన నా కాళ్ళను మెజిస్ట్రేట్ చూసి రెండు ఆసుపత్రులకు రిఫర్ చేశారు

సిఐడి పోలీసులు చిత్రహింసలకు గురి చేయడంతో కందిపోయిన నా కాళ్ళను చూసి మెజిస్ట్రేట్ తీవ్ర షాక్ కు గురయ్యారు. ఆమె వెంటనే నన్ను రెండు ఆసుపత్రులలో చికిత్స చేయించాలని రిఫర్ చేశారు. నాపై పోలీసులు దాడి చేసిన ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయి. కోర్టు బయట విలేకరులు తీసిన ఫోటోలు ఉన్నాయి. జ్ఞాన శూన్య అవార్డు గ్రహీత సుధాకర్ రెడ్డి, దళిత ద్రోహి సునీల్ కుమార్ ఎన్ని కహానీలు చెప్పినా వారికి ఎంతమంది ప్రవీణ్ కుమార్లు కలిసి మద్దతు ఇచ్చినా, నిజమైన దళితులు ఎవరు వారికి మద్దతు ఇవ్వరన్నారు.

ఈ నిజం ముందు ప్రజలందరికీ తెలియాలి. దళిత నేతలందరికీ తెలియాల్సిన అవసరం ఉంది. పివి సునీల్ కుమార్ దళిత వ్యతిరేకి. అతన్ని దళితులు ఎవరు నమ్మరని, అతనికి మద్దతుగా అక్కడక్కడ బుల్లి, బుల్లి, చిన్ని, చిన్ని నిరసనలను తెలియజేస్తే అది వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నాను. దళితులకు ఏ కష్టం వచ్చినా నేను ముందు ఉంటాను. ఈ విషయాన్ని తమ్ముడు మహాసేన రాజేష్ ను అడిగి తెలుసుకోవచ్చు.

ఇదే పీవీ సునీల్ కుమార్ మహాసేన రాజేష్ ను అతడి అనుచరుడుని, శ్రీకాకుళం తీసుకువెళ్లి హింసించినప్పుడు దెబ్బ తిన్న వ్యక్తితో, రాజేష్‌తో నేను మాట్లాడాను. వారిని పరామర్శించాను. పీవీ సునీల్ కుమార్ చేతిలో ఎక్కువమంది దెబ్బలు తిన్నది దళితులేనని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

రాజు గారే ముందుకొచ్చి ధైర్యం చేయకపోతే... ఇంకా ఎవరు చేస్తారని అందరూ అంటున్నారు

గత ప్రభుత్వ హయాంలో అకారణంగా వేధింపులకు గురైన వారి పక్షాన రాజుగారే ముందుకొచ్చి ధైర్యం చేయకపోతే.. ఇంకెవరు చేయగలరని ప్రజలు భావిస్తున్నారని, అందుకే అందరి పక్షాన తాను పోరాడుతున్నానని రఘురామకృష్ణం రాజు తెలిపారు. పోలీసుల చిత్రహింసల వల్ల దెబ్బలు తిన్న నాకు పోరాడడం వల్ల కొత్తగా వచ్చేది ఏమిటని కొందరు భావించవచ్చు.

కానీ ఇటువంటి అన్యాయం మరొకరికి జరగకుండా, ప్రభుత్వం చెప్పినా ఈ తరహా అరాచకాలను పోలీసులు చేయకుండా, భయం కలగాలనే ఉద్దేశంతోనే పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఈ కేసులో నేరస్తులకు శిక్ష పడుతుందన్న ఆయన, వారు పేరు మోసిన ప్రముఖ న్యాయవాదులను నియమించుకుంటారని, అందుకు తగ్గట్టుగా నేను కూడా డబ్బులు ఖర్చు పెట్టి న్యాయవాదులను నియమించాల్సి ఉంటుందన్నారు.

### సునీల్‌పై కంప్లైంట్ ఇస్తే ప్రవీణ్ కుమార్ చాలా ఫీలయ్యారు

నాపై హత్యా ప్రయత్నం చేసిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పై నేను ఫిర్యాదు చేస్తే, తెలంగాణలో ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చాలా ఫీల్ అయ్యారని రఘురామ కృష్ణంరాజు ఎద్దేవా చేశారు. ఒక ప్రభుత్వ అధికారిపై మూడేళ్ల తరువాత కేసు నమోదు చేస్తారా?, ఇలా చేస్తే అధికారులు పనిచేయగలరా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. మీ కులానికి చెందిన వారైతే ఒక రూలా? మరొకరికి అయితే మరొక రూలా? అంటూ రఘురామ కృష్ణంరాజు ప్రశ్నించారు.

థిస్ ఫెలో, గయ్ అంటూ ఎమ్మెల్యేగా ఎలా ఎన్నికయ్యారంటూ ప్రవీణ్ కుమార్ లేకి మాటలను మాట్లాడారని మండిపడ్డారు. అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకుడు పరిటాల రవి ని చూసి తప్పు చేసిన వారు గడగడలాడేవారు. ఆయన్ని కిరాయి గుండాలు వచ్చి చంపినప్పుడు, అనంతపురం జిల్లా ఎస్పీగా ఈ మహానుభావుడే ఉన్నాడు. విధి నిర్వహణలో ముక్కుసూటిగా ఉండే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, చంపాలనుకొని వచ్చే వారిని చంపనిస్తాడు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చి రెండేళ్లలో మూడుసార్లు ఓడిపోయారు. రెండుసార్లు బీఎస్పీ తరపున ఎమ్మెల్యేగా, ఒకసారి బిఆర్ఎస్ తరపున ఎంపీగా ఓడిపోయారు. ఆయనకు ఆయన ఎక్కువగా ఊహించుకొని తుక్కు తుక్కుగా ఓడిపోగా, నేను ఎమ్మెల్యేగా 56 వేల 777 ఓట్ల మెజారిటీతో గెలిచాను. 64% ఓట్లు నాకు పోల్ అయ్యాయి. నేను ఎమ్మెల్యేగా గెలిచినందుకు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆ మాత్రం షాక్ లో ఉండడం సహజమేనని అపహస్యం చేశారు.

ఐపీఎస్ చదివి ప్రవీణ్ కుమార్ పాసయ్యారని అనుకుంటున్నాను. ఇప్పటికైనా లేకి మాటలు మాట్లాడడం మానేయాలి. ఆయన బాధ ఆక్రోశానికి కారణం లేకపోలేదని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ప్రభుత్వ సర్వీసులలో కొనసాగుతూ ఈ దేవుళ్లను, ఆ దేవుళ్లను మొక్క రాదని, మతం గురించి ఆయన మాట్లాడడాన్ని నేను పార్లమెంటులో ప్రస్తావించాను.

రాజ్యాంగంలో పౌరులకు కలిగిన హక్కులను ఆర్టికల్ 14 నుంచి 22, 24 వరకు పొందుపరిచారు. సాధారణ పౌరులకు ఇచ్చిన హక్కులను, ప్రభుత్వ అధికారులకు ఇవ్వలేదు. ప్రభుత్వ అధికారులకు కొన్ని సర్వీస్ రూల్స్ అనేవి ఉంటాయి. ప్రభుత్వ అధికారులకు కొన్ని నిబంధనలు ఉంటాయి. హాస్టల్ లో కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన కొన్ని నిర్వాహకాల గురించి నేను పార్లమెంట్ లో ప్రస్తావించడం ద్వారా, వివరాలను అందజేయాలని ఆదేశించడం జరిగింది.

దీనితో వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయ రంగంలోకి వచ్చి భంగపాటు పడ్డారు. ప్రవీణ్ కుమార్ తో పాటు, పీవీ సునీల్ కుమార్ కులాన్ని అడ్డుపెట్టుకొని వికృత చేష్టలు చేయడం తగదని రఘురామకృష్ణం రాజు అన్నారు.

### అన్నా క్యాంటీన్ల నిర్వహణకు ముందుకు రానున్న దాతలు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేరిట ఏర్పాటు చేయనున్న అన్నా క్యాంటీన్ల నిర్వహణ కోసం ఎంతోమంది దాతలు ముందుకు రానున్నారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడితే విదేశాల్లో స్థిరపడిన వారు, స్వదేశంలో నివసించేవారు ఒక పూట భోజనం పెట్టడానికి ముందుకు రావడం ఖాయం అన్నారు. ఒక పూట భోజనం పెట్టేవారి ఫోటో, వారి ఫ్యామిలీ ఫోటో అన్నా క్యాంటీన్లలో కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఒక టీవీని ఏర్పాటుచేసి టీవీలలో దాతల ఫోటోలను ప్రదర్శించాలన్నారు.

అవసరమైతే స్క్రీన్ కూడా దాతలే ముందుకు వచ్చి అందజేస్తారని తెలిపారు. ఆకలితో ఉన్నవారు భోజనం చేసి అన్నదాత సుఖీభవ అని దీవిస్తే, దాతలకు వెయ్యినుగుల మానసిక బలాన్ని ఇస్తుందన్నారు. ఒక మంచి పని చేస్తే లభించే గుర్తింపు ఇతరులను మంచి పని చేయడానికి ప్రోత్సాహకాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వం అతి తక్కువ బడ్జెట్లో ఈ విధంగా అన్నా క్యాంటీన్లను నిర్వహించవచ్చునని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

మన సంస్కృతి సాంప్రదాయంలోనే అన్నార్తులకు భోజనం పెట్టి పంపాలని పేర్కొనడం జరుగుతుందన్న ఆయన, గురుద్వారకు వెళ్ళిన ప్రతి ఒక్కరికి భోజనం పెట్టి పంపడం జరుగుతుందన్నారు. ఏ మతంలోనైనా ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టాలని చెప్పడం జరుగుతుందని తెలిపారు.

### సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు

ఉండి నియోజకవర్గ పరిధిలోని సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు నా స్నేహితుల సహకారంతో అన్నీ చర్యలు తీసుకోనున్నట్లు రఘురామకృష్ణంరాజు తెలిపారు. సంక్షేమ హాస్టల్లో పరిస్థితి చూసిన తర్వాత నా కళ్ళల్లో నీళ్లు సుడులు తిరిగాయి. బోర్డింగ్ స్కూళ్లలో ఉండే వసతులకు తక్కువ కాకుండా ఉండి నియోజకవర్గ పరిధిలోని సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మినిమం బడ్జెట్‌తో సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాన్లు, డైనింగ్ టేబుల్, బాత్రూంలు, టాయిలెట్లు కనీస సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉండి నియోజకవర్గ పరిధిలో సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల క్రీడా ప్రాంగణాలను ఆగస్టు 15వ తేదీ నాటికి అభివృద్ధి చేయడమే కాకుండా గ్రీనరీ ఏర్పాటు చేస్తామన్నారు. గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నిర్దేశించిన సమయంలోగా ప్రభుత్వ పాఠశాలల క్రీడా ప్రాంగణాల అభివృద్ధిలో ఎటువంటి ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



# ప్రపంచ దేశాలకు ఏపీ ప్రకృతి వ్యవసాయం ఆదర్శం

### అన్ని రాష్ట్రాలకు ఏపీ నుంచి సూచనలు

### రాష్ట్ర వ్యవసాయ, శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి,

ప్రపంచ దేశాలకు మన రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్న ఇండోనేషియా, శ్రీలంక, జాంబియా, రూవాండ దేశాలకు ఛాంపియన్ రైతులను పంపించి తద్వారా సాంకేతిక మద్దతును సమకూర్చేందుకు RYSS సంసిద్ధం అవుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 45 దేశాల ప్రతినిధులు రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించడం గర్వకారణం అని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో నిగూఢమై ఉన్న సైన్స్ ను అర్థం చేసుకొనేందుకు వివిధ దేశాల ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటించారని, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా APCNF కార్యక్రమానికి వచ్చిన ప్రతిష్టాత్మక “గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటి” అవార్డు అందుకొని పోర్చుగల్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ & ప్రభుత్వ సలహా దారులు టి.విజయ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ మంత్రి అచ్చెన్నాయుడుని మంగళవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు.

15 రాష్ట్రాలకు ఛాంపియన్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లను పంపించి అక్కడ ప్రకృతి వ్యవసాయానికి నాంది పలికిన ఏపీ రైతు సాధికార సంస్థ జాతీయ వనరుల సంస్థగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో మంత్రి గారు రైతు సాధికార సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2016లో రైతు సాధికార సంస్థను ఏర్పాటు చేశారని, ప్రకృతి వ్యవ సాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 17, జులై 2024

# బాబు మెచ్చిన అధికారి జాస్తి కృష్ణకిషోర్

◆ **ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌లో అపార అనుభవం**

అమరావతి, మహానాడు:

2014–19 లో సీఎం చంద్రబాబు పట్టుపట్టి కేంద్రం నుంచి తెచ్చుకున్నారు ఆయన్ను. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (APEDB) సీఈవోగా నియమించి.. రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించే బాధ్యతను అప్పజెప్పారు. బాబుగారి నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చెయ్యకుండా... కియా లాంటి పరిశ్రమల నుండి ఫాక్స్ కాన్, టీసీఎల్, మొండాలెజ్, డిక్సన్ లాంటి వందలాది సంస్థలతో నిరంతర సంప్రదింపులు జరిపి ఫాలో అప్ చేసి రాష్ట్రానికి రప్పించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయనే జాస్తి కృష్ణకిషోర్.

2010లో ఆదాయపు పన్ను శాఖలో ఉన్నప్పుడు జగన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారించిన అధికారుల బృందంలో ఆయన కూడా ఉన్నారు. 2010లో జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్‌పై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) దాడులు నిర్వహించి, సోదాల అనంతరం రూ.122.78 కోట్ల భారీ పన్ను విధించింది. ఈ కారణంగా 2019లో వస్తూ వస్తూనే ఆయనపై కక్ష సాధింపు చర్యలు చేపట్టి... ఏపీఈడీబీలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణతో సస్పెండ్ చేసి ఏసీబీ & సీఐడీ కేసులు పెట్టి వేధించారు జగన్మోహన్ రెడ్డి.

ఏబీ వెంకటేశ్వరరావుతో పాటు ఈయన కూడా క్యాట్‌కి



పలుమార్లు వెళ్ళాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు క్యాట్ ఈయనపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో.. తిరిగి కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు.

తిరిగి ఇన్నాళ్లకు చంద్రబాబును కలిశానంటూ కృష్ణకిషోర్ పేర్కొన్నారు. ఆయన మళ్లీ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈవోగా రావాలని మరెన్నో పరిశ్రమలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

# బోధన సరిగా లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

◆ **విద్యార్థుల ఫిర్యాదుతో ఉపాధ్యాయునిపై విచారణ**

తెనాలి, మహానాడు:

పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పై జిల్లా కలెక్టర్ కు విద్యార్థులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు షేక్ యాస్మిన్, బి.అవంతిక, ఎన్ సుప్రజ కలిసి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

తెలుగు ఉపాధ్యాయులు నాగేశ్వరరావు బోధన సరి లేదని, ఆయనను బదిలీ చేయాలని వివరించారు. విద్యార్థినుల ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ విచారణకు జిల్లా విద్యాధికారిని ఆదేశించగా, ఆమె ఆదేశాల మేరకు తెనాలి జిల్లా ఉప వైద్యాధికారిణి శాంతకుమారి, మండల విద్యాధికారి డాక్టర్ ఎం లక్ష్మీనారాయణ పాఠశాలలో విచారణ చేపట్టారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడగా, వారు ముక్తకంఠంతో తెలుగు ఉపాధ్యాయుడిని బదిలీ చేయాల్సిందేనని కోరారు. తెలుగు బోధనలో లిఖితపూర్వకంగా ఆయన చేసిన తప్పిదాలను వెల్లడించారు.

దీంతో స్పందించిన అధికారులు నాగేశ్వరరావు ను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. అలాగే పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరిని తెలుగు బోధించేందుకు సర్దుబాటు చేశారు. విద్యార్థుల సమస్యపై సకాలంలో స్పందించని హెడ్మాస్టర్ సరళను కూడా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలపై ప్రధానోపాధ్యాయుల దృష్టికి వచ్చిన వెంటనే



స్పందించాలని, ఇంకా పాఠశాలల్లో ఎక్కడైనా ఈ పరిస్థితి ఉంటే అధికారుల దృష్టికి తేవచ్చని వారు స్పష్టం చేశారు.

తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ

తనకు గతంలో పెద్ద ప్రమాదం జరగడం వల్ల అనారోగ్య సమస్యలకు గురయ్యానని, అప్పటి నుంచి తన మాట నంగిగా వస్తుందని తెలుగు నిదానంగా విద్యార్థులకు బోధన చేస్తున్నానని తాను నిదానంగా చెప్పడం వల్ల విద్యార్థులకు అర్థం కావడం లేదని తనపై ఫిర్యాదు చేశారనీ తెలిపారు.

# కోటప్పకొండ భక్తులకు ఎలాంటి లోటు రానివ్వను

◆ **కోటప్పకొండ గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డా.చదలవాడ**

నరసరావుపేట, మహానాడు:

కోటప్పకొండ వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకునే బాధ్యత నాది అని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను ఆలయ ఈవో, ఫారెస్ట్ అధికారులతో కలిసి పరిశీలించారు. తొలి ఏకాదశి సందర్భంగా జరగబోయే గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చేస్తానన్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో రాళ్లు,పిచ్చి మొక్కలు తీసివేయాలని అధికారులకు సూచించారు. ప్రతి చోట మంచి నీళ్ళు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపుపై శ్రద్ధ పెట్టాలన్నారు. గిరి ప్రదక్షిణలో నియోజకవర్గ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలకు సేవ చేసే విషయంలో నిత్యమూ



అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కోటప్పకొండ ఈవో, ఫారెస్ట్ ఆఫీసర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఏపీ పెన్షన్ దారుల సంఘం సభ్యులు ఏపీలో అన్నక్యాంటీన్‌కు రూ.2 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి చెక్కు అందించారు.



తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామలరావు ఐఏఎస్‌ని ఈవో క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు ఐపీఎస్.

# రుణమాఫీ పథకం నిబంధనలు సవరించాలి

◆ **సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

హైదరాబాద్, మహానాడు:

రైతులకు రుణమాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నెం.567లోని నిబంధనలను అమలుచేస్తే పెద్ద సంఖ్యలో పేదరైతులకు రుణమాఫీ వర్తించదు. అత్యధికమంది రైతులకు రుణమాఫీ అమలు జరిగేలా జీవోను సవరించాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

రుణమాఫీ ప్రధానంగా రేషన్కార్డు ఆధారంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి కుటుంబం నుండి విడిపడిన 10లక్షల కుటుంబాలు ఇప్పటికే రేషన్కార్డుల కోసం గత 10 సం.లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వీరందరూ రుణమాఫీకి అర్హులు కాలేరు. ఆధార్, పాస్బుక్, రేషన్కార్డుల డేటా సమన్వయం మేరకు రుణమాఫీ వర్తిస్తుందని ప్రకటించారు.

పాస్ బుక్ లేనివారు లక్షలలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ధరణి లోపాల వల్ల పాస్బుక్స్ ఇవ్వలేదు. ఇలాంటి నిబంధనలు పెట్టినట్టయితే చాలామంది పేదరైతులు రుణమాఫీ నుండి మినహాయించబడతారు.

సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, రైతుమిత్ర, కౌలు గుర్తింపు కార్డులు ఉన్నవారికి రుణమాఫీ వర్తించదని నిబంధనలలో పేర్కొన్నారు. దీనివల్ల కౌలు రైతులు, పేదరైతులు నష్టపోతారు. గ్రామీణ ప్రాంతాలలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులలో ఉన్న మహిళలు తమ రుణాలను వ్యవసాయానికే ఖర్చు చేస్తారు. ఈ గ్రూపులలో దళిత, గిరిజన, బిసి రైతులు



ఎక్కువగా ఉంటారు.

ప్రకృతి వైపరీత్యాల ఫలితంగా రీషెడ్యూల్డ్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదని జీవోలో పేర్కొనడం సరైందికాదు. దీంతోపాటుగా రెన్యువల్ చేసిన రుణాలు లేదా వసూలు చేసిన రుణాలకు రుణమాఫీ వర్తింపజేయాలి. రు.2లక్షలకు పైగా రుణం ఉన్నట్టయితే ఆ అప్పు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని విధించిన నిబంధనవల్ల మధ్యతరగతి రైతులు నష్టపోతారు.

జీఓను యధాతథంగా అమలుచేస్తే లక్షలమంది రైతులు రుణమాఫీ అర్హతను కోల్పోతారు. ప్రభుత్వం పునరాలోచించి జీవో 567ను సవరించి రు.2లక్షల వరకు రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ(ఎం) కోరుతున్నది.

## జీహెచ్ఎంసీ స్పందించకపోతే

# మేమే శ్రమదానం చేస్తాం...

◆ **స్థానికుల సమస్యలు పరిష్కరించటంలో జీహెచ్ఎంసీ వ్యవహరిస్తున్న తీరుపై కేటీఆర్ ఆగ్రహం**

◆ **ఎన్ని ఫిర్యాదులు చేసిన మేయర్ పట్టించుకోవటం లేదంటూ కేటీఆర్ కు ఓ నెటిజన్ ట్వీట్**

◆ **ట్వీట్‌పై స్పందిస్తూ జీహెచ్ఎంసీ స్పందించకపోతే తామే శ్రమదానం చేస్తామని హెచ్చరించిన కేటీఆర్**

హైదరాబాద్,మహానాడు:

ప్రజలు తమ కాలనీల్లో సమస్యలున్నాయంటూ ఎన్ని ఫిర్యాదులు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యను పరిష్కరించే విషయంలో జీహెచ్ఎంసీ ఎందుకు విఫలమవుతుందని ప్రశ్నించారు.

తమ కాలనీలో చెట్లు భారీగా పెరిగిపోవటం, చెత్త చెదారం కారణంగా పాముల బెడద ఉందంటూ జీహెచ్ఎంసీ మేయర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ ఓ వ్యక్తి కేటీఆర్ కు ట్విట్టర్ ద్వారా తెలిపారు. తమ కాలనీలో 50 కుటుంబాలున్నాయని మాకు సరైన రోడ్లు, నీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రాత్రి అయితే చాలు దొంగతనాలు జరుగుతున్నాయని కేటీఆర్‌కు వివరించాడు.



ఈ ట్వీట్‌పై కేటీఆర్ స్పందించారు. ఆ నెటిజన్ ఫిర్యాదుపై స్పందించి సమస్య పరిష్కరించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఏ సమస్య ఉన్న సరే ఒక్క ట్వీట్ చేస్తే ఆ సమస్యను పరిష్కరించేవాళ్లమని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కార్పొరేటర్ల పార్టీ ఫిరాయింపులపై మాత్రమే ఈ ప్రభుత్వం దృష్టి పెట్టటంతో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందన్నారు.

ఇకనైనా ప్రజ సమస్యలపై మేయర్ సహా ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. లేదంటే 48 గంటల్లో సమస్య పరిష్కారం కాకపోతే స్థానికులతో కలిసి తామే శ్రమదానం చేసుకొనిసమస్య పరిష్కరించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# నరసరావుపేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చే బాధ్యత నాది

◆ **ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు**

◆ **శానిటేషన్ వారోత్సవాలపై సమీక్ష**

నరసరావుపేట, మహానాడు:

రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్ దిశగా అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్నారని, నరసరావు పేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చే బాధ్యత నేను తీసుకుంటానని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో శానిటేషన్ డ్రైవ్ గురించి సమీక్షించారు.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా రేపటి నుంచి శానిటేషన్ వారోత్సవాలు జరపాలని అధికారులకు సూచించారు. నరసరావుపేటలోని 33 వార్డులను 3 యూనిట్లుగా తీసుకొని ఒక్కొక్క యూనిట్ లోని సిబ్బంది అంతా ఒక రోజు ఒకే చోట పని చేసి నరసరావుపేటను మూడు రోజుల్లో క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని,ఆ మేరకు అవగాహన కల్పించాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రతి పౌరుడు బాధ్యత తీసుకొని మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఇద్దరు సిబ్బంది ఆ వార్డులోని శానిటేషన్ వ్యవస్థ పై పర్యవేక్షించాలని అన్నారు.ముఖ్యంగా అండర్ డ్రైనేజ్‌కి



దగ్గరలో ఉన్న మంచినీళ్ళ పైపుల పై,డ్రైనేజ్ ఫ్రీ మూమెంట్ లేని చోట, స్లమ్ ఏరియాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.


నరసరావుపేటలో అంటువ్యాధులు రాకుండా మున్సిపల్ అధికారులతో పాటు ప్రతి ఒక్కరు బాధ్యత అనుకొని శానిటేషన్ వారోత్సవాల్లో పాల్గొనాలని, రోగ రహిత నరసరావుపేటను సాకారం చేసుకుందామని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, నగసరపు సుబ్బరాయ గుప్తా, కపిలవాయి విజయ్ కుమార్, వేల్పుల సింహాద్రి యాదవ్, కొట్ట కిరణ్, వాసిరెడ్డి రవి, కొవ్వూరు బాబు, సంజీవ్ రావు, మున్సిపల్ డి.ఈ,ఏ.ఈలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వుల జారీ సంతోషకరం

◆ **రేవంత్ రెడ్డికి, అధికారులకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అభినందనలు**

హైదరాబాద్,మహానాడు:

ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా పరిపాలనకు సంబంధించిన అంశాలు తెలుగులో జారీ చేయాలని నేను ఎప్పటినుంచో సూచిస్తూనే ఉన్నాను. తెలంగాణ ప్రభుత్వం తొలిసారి తెలుగులో, అందులోనూ రైతుల రుణమాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం.



ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు వారికి సులువుగా అర్థమయ్యే భాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించి ఇతర సమాచారం ఉండాలని నేను ఎప్పటి నుంచో చెబుతున్నాను. ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యమిస్తూ తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావుకి, ఈ ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇతర అధికారులు, సిబ్బందికి అభినందనలు.

రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇకనుంచి అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలని ఆకాంక్షిస్తున్నాను.

11

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 17, జులై 2024


ఉస్తాద్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ సెన్సేషనల్ హిట్ ఇస్మార్ట్ శంకర్ సినిమా థియేటర్లలో విడుదల కాకముందే మ్యూజికల్ హిట్ అయ్యింది. అదేవిధంగా, ఈ డెడ్లీ కాంబినేషన్‌లో సెకెండ్ మూవీ ఆల్బమ్ కూడా విడుదలకు ముందే చార్ట్‌బస్టర్‌గా మారింది. ఇస్మార్ట్ శంకర్‌కి సీక్వెల్ అయిన డబుల్ ఇస్మార్ట్ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్న మణిశర్మ, మరో మాస్-అపీలింగ్ చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను స్కోర్ చేశారు. ఫస్ట్ సింగిల్ స్టెప్పా మార్ కి థంపింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈరోజు, సినిమా సెకెండ్ సింగిల్ మార్ ముంత చోడ్ చింత విడుదలైంది. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పెక్యులర్ గా వున్నాయి, హైదరాబాద్ యాసలో అద్భుతంగా ఆకట్టుకున్నాయి.

ఇది దేశీ పార్టీ నంబర్‌కి వైబ్ ని యాడ్ చేస్తోంది, మణి శర్మ కంపోజిషన్ వెరీ నేటివ్ ఫోక్ తో ఆకట్టుకుంది. బీట్స్ చాలా హైగా ఉన్నాయి. ఇన్స్ట్రుమెంట్స్ హై ఎనర్జీని ఇస్తున్నాయి. రాహుల్ సిప్లిగంజ్, ధనుంజన్ సీపాన, కీర్తన శర్మ త్రయం ఈ పాటకు వోకల్స్ అందించారు. వారి వోకల్స్ పాటలోని ఎనర్జీకి పెర్ఫెక్ట్ గా మ్యాచ్ అయ్యాయి. రామ్ ఎనర్జీ నెక్స్ట్ లెవల్ లో వుంది. అతని డ్యాన్స్ కన్నుల పండువగా వుంది. హుక్ స్టెప్ ఇన్స్టంట్ గా పాపులర్ అయ్యింది. రామ్‌తో పాటు కాలు కదిపిన కావ్య థాపర్ ఈ పాటలో పెర్ఫెక్ట్ గ్లామర్ ని యాడ్ చేశారు, లైవ్లీ సెట్స్ లో షూట్ చేశారు. దేశీ పార్టీస్ టైంలో ఈ పాట ప్రతి ఒక్కరికీ ఫ్రైమ్ చాయిస్ అవుతుంది.

## 'డబుల్ ఇస్మార్ట్' సెకెండ్ సింగిల్



## 'సర్దార్ 2' పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో సూర్య



హీరో కార్తి 'సర్దార్' సినిమా తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఇటీవలే సర్దార్ 2 రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో భారీ సెట్స్‌లో ప్రారంభమైయింది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్ 2కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మించనుంది. తాజాగా మేకర్స్ ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో స్టార్ యాక్టర్ ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ క్యారెక్టర్ లో నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. కార్తీ, ఎస్ జె సూర్య లని స్క్రీన్ పై చూడటానికి ఫ్యాన్స్ ఎక్సయిటింగ్ గా ఎదురుచూస్తున్నారు. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లోతెరకెక్కనుంది. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. సర్దార్ 2 చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. AP పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. ఎ వెంకటేష్ సహ నిర్మాతగా, ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



## డార్లింగ్' కాన్సెప్ట్ అదిరిపోయింది... ఖచ్చితంగా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది: నాని

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఎంటర్టైనింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తోంది. డార్లింగ్ జూలై 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ నేపధ్యంలో చిత్ర యూనిట్ ఘనంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. నేచురల్ స్టార్ నాని చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నెక్స్ట్ మంత్ సరిపోదా శనివారం ప్రమోషన్స్ స్టార్ట్ అవుతాయి. దర్శి వలన కొంచెం ముందుగానే స్టార్ట్ అయినయ్. ఈ ఈవెంట్ కి రావడం చాలా ఆనందంగా వుంది. డార్లింగ్ టీజర్ ట్రైలర్ చాలా ఎంటర్ టైనింగ్‌గా వున్నాయి. ఈ మధ్య యాక్షన్ సినిమాలు ఎక్కువైపోయి కామెడీ, లవ్ స్టోరీలని మిస్ అవుతున్నాం. లాస్ట్ ఇయర్ లవ్ స్టొరీ, ఎమోషన్ కలిపి హాయ్ నాన్నతో వచ్చాను. ఈ ఏడాది దర్శి లవ్ స్టొరీ, కామెడీ కలిపి డార్లింగ్‌తో వస్తున్నారు. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలి. కామెడీ ఎమోషన్ లవ్ యాక్షన్..ఇలా అన్నీ జోనర్ సినిమాలు రావాలి. దర్శి లాంటి ట్యాలెంటెడ్ యాక్టర్ అలాంటి డిఫరెంట్ సబ్జెక్ట్స్ సెలెక్ట్ చేసుకోవడం చాలా హ్యాపీగా వుంది. స్ప్లిట్ పర్సనాలిటీ కాన్సెప్ట్ అదిరిపోయింది. లేడి అపరిచితుడు. ఇలాంటి కాన్సెప్ట్ తో సరిగ్గా చేస్తే ఎంత లాఫ్టర్ జనరేట్ చేయొచ్చో వూహించగలను. ట్రైలర్ చూస్తుంటే పర్ఫెక్ట్ ఎంటర్ టైనర్ అనిపిస్తుంది. నిరంజన్ గారు, చైతన్య గారి హనుమాన్ అంత సక్సెస్ డార్లింగ్ కావాలని కోరుకుంటున్నాను. వివేక్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఇష్టం.

తనకి ఓ కల్ట్ ఫాలోయింగ్ వుంది, డార్లింగ్‌తో మరో బ్లాక్ బస్టర్ అందుకుంటాడు. డైరెక్టర్ అశ్విన్ గారి ఆల్ ది వెరీ బెస్ట్, ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరు కుంటున్నాను. నభా 'డార్లింగ్' తో న్యూ చాప్టర్ స్టార్ట్ చేస్తున్నారు. ఇది అద్భుతంగా వుండాలని కోరుకుంటు న్నాను. డార్లింగ్ టీం అందరికీ ఆల్ ది బెస్ట్' తెలిపారు.



## రోటి కపడా రొమాన్స్ టీమ్‌ను చూస్తుంటే ఈ నగరానికి ఏమైంది గుర్తొస్తుంది..

'హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. ఆగస్టు 2న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలోని గలీజ్ సాంగ్ ఆవిష్కరణ హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాస్‌కాదాస్ విశ్వక్‌సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ నిర్మాత బెక్కెం వేణుగోపాల్‌కు మంచి టేస్ట్ వుంది. లవ్‌స్టోరీస్ మీద మంచి జడ్జిమెంట్ వుంది.

ప్రతి సినిమాను ఎంతో పాషన్‌తో నిర్మిస్తాడు. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు ఈ నగరానికి ఏమైంది రోజులు గుర్తొస్తున్నాయి. హీరోలు, హీరోయిన్స్ చక్కగా వున్నారు. ఈ సినిమా విజయం సాధించి టీమ్ అందరికి మంచి పేరు తీసుకరావాలి.

ఈ సినిమాను థియేటర్‌లో అందరూ చూడాలి. నిర్మాతలకు మంచి వసూళ్లు రావాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, మేఘలేఖ, తదితరులు పాల్గొన్నారు.

## బచ్చలమల్లి ఫోక్ మెలోడీ

యూనిక్ మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి' మేకర్స్ ముందుగా అనౌన్స్ చేసినట్లుగా సెప్టెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఫస్ట్ లుక్, అల్లరి నరేష్ బర్త్ డే స్పెషల్ గ్లింప్స్ సినిమాపై చాలా క్యూరియాసిటీని పెంచాయి. మేకర్స్ ఇప్పుడు మ్యూజిక్ జర్నీ కిక్ స్టార్ట్ చేశారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ మా ఊరి జాతరలో రిలీజ్ అయ్యింది. సీతారామం ఫేమ్ కంపోజర్ విశాల్ చంద్రశేఖర్ ఫోక్, ఫంక్ బ్లెండ్ చేస్తూ పాటను స్కోర్ చేసారు. ఈ మెలోడీని సింధూరి విశాల్‌తో కలిసి హను-మాన్ కంపోజర్ గౌరా హరి మెస్మరైజింగ్ పాడారు. అల్లరి నరేష్, అమృత అయ్యర్‌ల అద్భుతమైన బాండింగ్‌ని లిరిసిస్ట్ శ్రీమణి చాలా ఆకర్షణీయంగా అందించారు. లీడ్ పెయిర్ ఒకరినొకరు ఎంతగా ప్రేమిస్తున్నారో ఈ పదాలు వివరిస్తాయి. నరేష్ తన భార్యకు ఏదో ఒక స్పెషల్ ప్రెజెంట్ చేయలాని కోరుకుంటుండగా, ఆమె తన జీవితాంతం అతనితో గడపాలని కోరుకుంటుంది. విజువల్స్ కంపోజిషన్ బ్యూటీఫుల్ గా ఉన్నాయి. అల్లరి నరేష్, అమృత అయ్యర్ అద్భుతమైన కెమిస్ట్రీని షేర్ చేసుకున్నారు. ఇది ఖచ్చితంగా మీ ప్లేలిస్టు లో న్యూ ఫేవరేట్. ఈ చిత్రానికి సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144